

సేవాతత్పరుడు అంకినీడు

- మచిలీపట్నం ఎంపీగా ప్రజలకు విశేష సేవలు
- విద్యాదాతగా పేదల జీవితాల్లో వెలుగులు
- చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల అభివృద్ధికి కృషి
- చల్లపల్లి షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్‌గా రైతులకు తోడ్పాటు
- నేడు శ్రీమంతు రాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్ సంస్మరణ సభ



చల్లపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లి రాజధానిగా పరిపాలన చేసిన దేవరకోట సంస్థానాధీశులైన యార్లగడ్డ వంశీయుల్లో ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచిన వారిలో ఒకరు శ్రీమంతు రాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్. చల్లపల్లి రాజాగా చరిత్రలో నిలిచిన శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాద్ బహద్దూర్ (చల్లపల్లి రాజా) రెండవ కుమారుడైన అంకినీడుప్రసాద్ తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. ప్రజాప్రతినిధిగా రాణిస్తూ ప్రజలకు సేవచేశారు. తండ్రి చల్లపల్లి రాజా కృష్ణాజిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా, అవనిగడ్డ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా పనిచేయగా, అంకినీడుప్రసాద్ 1967-72 కాలంలో మచిలీపట్నం ఎంపీగా పనిచేశారు. భారత నాల్గవపార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో మచిలీపట్నం లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించారు. నాడు దేశంలో అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన అతి కొద్దిమందిలో అంకినీడుప్రసాద్ ఒకరు కావటం విశేషం. ఆ తర్వాత ఎన్నికల్లో పోటీ చేయకపోయినా రాష్ట్రంలోని రాజకీయాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ చల్లపల్లి ఎస్టేట్ ప్రాంతంలో పెద్దదిక్కుగా మారారు. రాజకీయ దిగ్గజాలతో సత్సంబంధాలు నెరుపుతూ ఎంతో హుందాగా ఉండేవారు. అందరూ చినబాబు, రాజాగారి బాబు అని అంకినీడు ప్రసాద్‌ను అప్యాయంగా పిలుచుకునేవారు. వ్యవసాయాధారిత పరిశ్రమ చల్లపల్లి షుగర్ ఫ్యాక్టరీకి చైర్మన్‌గా పనిచేసి రైతాంగం, కార్మికుల ఆర్థికాభివృద్ధికి దోహదపడ్డారు. తండ్రి చల్లపల్లి రాజా స్థాపించిన కళాశాల, హైస్కూల్ అభివృద్ధికి కరస్పాండెంట్‌గా విశేష కృషిచేశారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాలైన మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, పెదకళ్లేపల్లి శ్రీదుర్గానాగేశ్వరస్వామి ఆలయం, శ్రీకాకుళంలోని శ్రీఆంధ్రమహావిష్ణు ఆలయం, యార్లగడ్డలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, బందరులోని శివగంగ అమ్మవారి ఆలయాలకు వంశపారంపర్య ధర్మకర్తలుగా ఆధ్యాత్మిక వైభవానికి పాటుపడ్డారు. కాగా, అంకినీడు ప్రసాద్‌కు ఇద్దరు కుమారులు రామేశ్వర ప్రసాద్, హరీశ్వర ప్రసాద్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నెల 6వ తేదీ ఉదయం కోయంబత్తూరులోని స్వగృహంలో కన్నుమూయగా, మచిలీపట్నం శివగంగలోని స్వగృహంలో శుక్రవారం సంస్మరణ కార్యక్రమాలు జరుగనున్నాయి.

అర్హులైన దివ్యాంగులకే సామాజిక పింఛను ఇచ్చేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ దళారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. గతంలో నకిలీ సదరం సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులు కొందరు వైద్యుల తనిఖీల్లో తమ పింఛన్లు పోకుండా చూడాలని మళ్లీ పాత దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు తనిఖీ కేంద్రాల వద్ద మకాం వేసి మరీ తమ పాత పరిచయాలను ఉపయోగించుకుని పలువురు వైద్యుల సాయంతో గండం గట్టెక్కిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు గాను ఒక్కో పింఛనుదారుడి నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

పెన్షన్ దళారుల దందా!

'దివ్యాంగుల' తనిఖీల వేళ మరోమారు చేతివాటం



అవనిగడ్డ ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం సర్టిఫికెట్ల తనిఖీకి హాజరైన దివ్యాంగులు

- వైద్యుల తనిఖీల్లో సదరం సర్టిఫికెట్లు సక్రమంగా ఉన్నాయని చూపేందుకు కుట్ర
- మచిలీపట్నం నగరంతోపాటు మోపిదేవి మండలంలో బేరసారాలు
- ఒక్కో పింఛనుదారుడి నుంచి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు
- వైద్యులతో కుమ్మక్కై తెరవెనుక కథ నడుపుతున్న వైసీపీ దళారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల పింఛను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచింది. జిల్లాలో మూగ, చెవుడు, కంటి చూపు, పూర్తి స్థాయిలో మంచానికే పరిమితమై లేవలేని స్థితిలో ఉండి దివ్యాంగుల పింఛను పొందే వారు జిల్లాలో 32 వేల మంది వరకు ఉన్నారు. వీరిలో గతంలో అవయవాలు సక్రమంగా పనిచేస్తున్నా వైసీపీ నాయకుల సిఫార్సుతో దివ్యాంగులుగా సదరం సర్టిఫికెట్లు పొందినవారు అధిక శాతం మంది ఉన్నారు. చెవుడు ఉన్నట్లుగా సర్టిఫికెట్లు పొందినవారిలో సగం మందికిపైగా అనర్హులే ఉన్నారని సమాచారం. ప్రస్తుతం సదరం సర్టిఫికెట్ల తనిఖీలు జరుగుతుండటంతో అక్రమమార్గంలో దివ్యాంగుల పింఛన్లు పొందుతున్న వారు, గతంలో తమకు నకిలీ సర్టిఫికెట్లు ఇప్పించిన దళారులను ఆశ్రయిస్తున్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో అనుబంధం ఉన్న దళారులు మీ సర్టిఫికెట్ సక్రమంగా ఉన్నట్లుగా రాయిస్తామని, ఇందుకు ఒక్కొక్కరికి రూ.20 వేల నుంచి రూ.25వేల వరకు ఖర్చవుతుందని బేరాలకు దిగుతున్నట్టు తెలిసింది. వైద్యులతో మేము మాట్లాడుతామని, మీకు దివ్యాంగుల కోటాలో నెలకు రూ.6 వేలు వస్తుందని, ఓ నాలుగు నెలల పింఛను మీది కాదనుకుంటే, మీరు జీవించినంతకాలం పింఛను వస్తూనే ఉంటుందని దళారులు ఆశ చూపుతున్నారు. దీంతో నకిలీ పింఛను పొందే వారు నగదు ఇచ్చి తమ పింఛను రద్దు కాకుండా ఉండేందుకు దళారులను ఆశ్రయిస్తున్నారు.

బిజీబిజీగా దళారులు

అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రిలో గత నాలుగైదు రోజులుగా సదరం సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. గతంలో అడ్డగోలుగా సదరం సర్టిఫికెట్లు ఇప్పించిన మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి, కె.కొత్తపాలేనికి చెందిన ఇద్దరు వైసీపీ నాయకులు ఆస్పత్రి పరిసరాల్లోనే మకాం వేసి, తమ అనుచరుల ద్వారా తెరవెనుక బేరసారాలు నడుపుతున్నారు. గతంలో అర్హతలేని వారికి సదరం సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులు ఇటీవల కాలంలో ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. సదరం సర్టిఫికెట్ల తనిఖీల్లో స్థానికంగా పనిచేసే వైద్యులు కాకుండా, ఇతర మండలాల్లో పనిచేసే వైద్యులను జంబ్లింగ్ విధానంలో తనిఖీ అధికారులుగా నియమించారు. గతంలో ఇక్కడ పనిచేసిన వైద్యులు, వేరే ప్రాంతంలో పనిచేస్తూ మళ్లీ వారే సదరం సర్టిఫికెట్ల తనిఖీ అధికారులుగా ఇక్కడకు వచ్చారు. దీంతో దళారులు పాతపరిచయంతో వారి వద్దకు వెళ్లి మీరే గతంలో సదరం సర్టిఫికెట్లు మంజూరు చేశారని, మీరే నకిలీ సర్టిఫికెట్లుగా నిర్ధారణ చేస్తే మీరు కూడా ఇబ్బందుల పాలవుతారని భయపెడుతున్నారు. గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్‌లు సక్రమమైనవేనని రాయాలని, ఈ వ్యవహారంలో మీ వాటా మీదేనని చెప్పడం గమనార్హం. మచిలీపట్నం సర్వజనాస్పత్రిలో ఎంతోకాలంగా సదరం క్యాంపుల్లో చక్రం తిప్పుతున్న పాత దళారులే పింఛనుదారుల నుంచి మళ్లీ నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సదరం క్యాంపుల వద్దకు పాత దళారులు కాకుండా, కొత్తవారు ఎవరైనా వస్తే మీకు ఇక్కడ ఏం పని అంటూ కొందరు వైద్యులు వారిని అక్కడి నుంచి తరిమేసినంత పనిచేస్తున్నారు. వాస్తవంగా వైకల్యంతో ఇబ్బంది పడేవారిని ఆస్పత్రికి తీసుకువెళ్లి ఉన్నది ఉన్నట్లుగా నమోదు చేయాలని కోరినా మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రి వైద్యులు పట్టించుకోవడం లేదని కొందరు ద్వితీయశ్రేణి నాయకులు ప్రజాప్రతినిధుల వద్ద మొరపెట్టుకుంటున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా..

దివ్యాంగుల కోటాలో పింఛను కావాలంటే సదరం క్యాంపుల ద్వారా సర్టిఫికెట్లు ఇప్పిస్తామని కొందరు దళారులు ఆస్పత్రుల వద్దనే ఉండి వైద్యులు, ఆస్పత్రి సిబ్బందితో కుమ్మక్కై తెరవెనుక కథ నడిపారు. వీరిలో వైసీపీ నాయకులు అధికంగా ఉన్నారు. సర్టిఫికెట్ ఇప్పించేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా దళారుల కనుసన్నల్లో ఈ వ్యవహారం నడుస్తూనే ఉంది. గతంలో చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో ఉపాధి హామీ పనుల్లో దివ్యాంగుల కోటాలో పనులు చేసిన వారికి సంబంధించి అధికారులు తనిఖీ చేసిన సమయంలో నాలుగైదు గ్రామాల్లోనే 60 మందికిపైగా ఎలాంటి వైకల్యం లేకున్నా దివ్యాంగుల కోటాలో ఉపాధి హామీ పథకం పనులు చేసినట్లు, వారు సామాజిక పింఛను పొందుతున్నట్లు రుజువైంది. అర్హత లేకున్నా దివ్యాంగుల పింఛను పొందుతున్న వారు అన్ని మండలాల్లో, పురపాలక సంఘాల్లో ఉండటంతో వీరి ఏరివేతకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించింది. ఇందు కోసం ఆరు నెలల క్రితం ప్రభుత్వం వైద్యులతో మరోసారి దివ్యాంగులకు సంబంధించి వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు తనిఖీ కార్యక్రమం చేపట్టింది. వారంలో రెండు, మూడు రోజులు లేదా నిర్దేశించిన తేదీల్లో మచిలీపట్నం, అవనిగడ్డ, విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సర్టిఫికెట్ల తనిఖీ, వైద్య పరీక్షలు చేస్తున్నారు.

డీఎస్సీ పరీక్షలకు 2,798 మంది హాజరు

మచిలీపట్నం టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో మెగా డీఎస్సీ ఐదు పరీక్షా కేంద్రాల్లో గురువారం నిర్వహించారు. 2,910 మంది అభ్యర్థులకు 2,798 మంది హాజరయ్యారు. 212 మంది గైర్హాజరైనట్టు డీఈవో పి.వి.జె.రామారావు తెలిపారు.

విద్యార్థులు, యువతతో కలిసి యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



యోగాతో జీవితకాలం ఆరోగ్యం

- కలెక్టర్ డీకే బాలాజీ
- మోపిదేవిలో ఘనంగా యోగాంధ్ర
- యోగాసనాలతో ఆకట్టుకున్న చిన్నారులు

మోపిదేవి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజు క్రమం తప్పకుండా యోగా సాధన చేయటం ద్వారా జీవితకాలం ఆరోగ్యవంతంగా ఉండవచ్చునని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గురువారం మోపిదేవిలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం వద్ద అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి కలెక్టర్ బాలాజీ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగాసాధన అలవర్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. యోగాతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ యోగాసనాలు ప్రదర్శించి యువత, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. చల్లపల్లి మండలం యార్లగడ్డ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన యోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం యోగా శిక్షకులు, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, జ్ఞాపికలతో సత్కరించారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు, డీఆర్వో చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, పర్యాటక శాఖ అధికారి రామలక్ష్మణరావు, మెప్మా పీడీ సాయిబాబు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, ఎంపీపీ రావి దుర్గావాణి, జెడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, మోపిదేవి సర్పంచ్ నందిగం మేరీరాణి, తహసీల్దార్ శ్రీవిద్య, ఎంపీడీవో స్వర్ణభారతి, ఆయూష్ శాఖ అధికారులు జావేద్ ఖాన్, వాహిని తదితరులు పాల్గొన్నారు.



యోగా విన్యాసాలు ప్రదర్శిస్తున్న యార్లగడ్డ విద్యార్థులు

4,470 ప్రదేశాల్లో రేపు యోగా డే

- ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం

మచిలీపట్నం టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 4,470 ప్రదేశాల్లో ఈ నెల 21న యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. గురువారం రాత్రి జూమ్ యాప్‌లో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి కలెక్టర్ బాలాజీ యోగాంధ్ర కార్యక్రమం, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, తల్లికి వందనం తదితర కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కేలా యోగా దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు.తాడిగడప, ఉయ్యూరు మునిసిపాలిటీలు, బంటుమిల్లి, మొవ్వ, నాగాయలంక మండలాల్లో ఇంకా శిక్షణతరగతులు పూర్తి కాలేదన్నారు. జిల్లా స్థాయి యోగా కార్యక్రమాన్ని ఉయ్యూరులోని విశ్వశాంతిలో నిర్వహిస్తున్నామన్నారు. అదే రోజు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు జరపాలని చెప్పారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, డీఈవో రామారావు, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త రవికాంత్ పాల్గొన్నారు.

నిఘా కళ్లు

- న్యాయస్థానాల సముదాయంలో సీసీ కెమెరాల ఏర్పాటు
- కొత్త భవనం చుట్టూ 20 కెమెరాలు అమర్చిన పోలీసులు
- దొంగతనాలు, కొట్లాటకు చెక్ పెట్టేందుకే..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా పోలీసులు దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నిత్యం న్యాయవాదులు, కక్షిదారులతో రద్దీగా ఉండే న్యాయస్థానాల ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నూతనంగా ఎనిమిది అంతస్థులతో నిర్మించిన న్యాయస్థానాల సముదాయం చుట్టూ 20 సీసీ కెమెరాలు అమర్చారు. సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది ఈ కెమెరాల బాధ్యతలను చూస్తున్నారు. ఇదికాకుండా న్యాయస్థానంలోకి ప్రవేశించడానికి వీలుగా ఉన్న మూడు మార్గాల్లో మరో ఐదు సీసీ కెమెరాలను అమరుస్తున్నారు. కొత్త భవనం చుట్టూ మాత్రమే కాకుండా భవనంలోకి ప్రవేశించి లిఫ్టులు ఎక్కే మార్గంలోనూ నిఘానేత్రాలు అమరుస్తున్నారు.

చీమ చిటుక్కుమన్నా తెలిసేలా..

న్యాయస్థానాల సముదాయంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగినవి. వ్యక్తుల రాకపోకలను తెలుసుకునేలా, వారి సంభాషణలు సైతం వినే సాంకేతికత ఉన్న కెమెరాలను అమరుస్తున్నారు. దీనిలో ఆడియో, వీడియో స్పష్టంగా తెలుస్తుంది. ఈ కెమెరాలను ఎంజీ రోడ్డులోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తున్నారు. దీంతోపాటు కోర్టు ప్రాంగణంలో ఏం జరుగుతుందో ప్రత్యక్షంగా పోలీస్ కమిషనర్, సూర్యారావుపేట ఇన్‌స్పెక్టర్ వీక్షించే అవకాశం ఉంటుంది.



పాత కాపులకు బై బై.. యువతకు హాయ్ హాయ్

- యువనేత నారా లోకేశ్ నూతన నిబంధనలు
- సంస్థగత ఎన్నికలకు భిన్నంగా విధి విధానాలు
- పార్టీ పదవుల్లో కొత్త వారికి అవకాశం
- ఆశావహుల్లో హర్షాతిరేకాలు

సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే క్రమంలో తెలుగుదేశం పార్టీ కీలక ప్రక్రియ చేపట్టింది. ముందు నుంచీ యువనేత లోకేశ్ చెప్పుకొస్తున్న ప్రకారం పార్టీ పదవులను అప్పగించేందుకు కొన్ని నియమ నిబంధనలు విధిస్తూ బుక్‌లెట్ విడుదల చేసింది. ఇప్పటికే నియోజకవర్గాలకు సంస్థాగత పదవుల పంపిణీ కోసం త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసింది. వీరితో పాటు మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి పదవుల పంపిణీ ప్రక్రియ ప్రారంభించింది. ఈ విషయంలో బూత్, యూనిట్, క్లస్టర్ సభ్యుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

(నందిగామ/జగ్గయ్యపేట-ఆంధ్రజ్యోతి)

మండల పార్టీ అధ్యక్ష పదవుల ఎంపికకు సమావేశాలు నిర్వహించి ఆయా మండలాల లోని గ్రామ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు సమావేశానికి హాజరైన పార్టీ నేతల అభిప్రాయాలు సేకరించిన నివేదిక ఆధారంగా పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక నిర్వహించే విధంగా విధి విధానాలు రూపకల్పన చేశారు. ముఖ్యంగా మూడు పర్యాయాలు లేక ఆరేళ్ల పాటు పార్టీ పదవుల్లో ఉన్న వారిస్థానంలో కొత్త వారికి అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలు నిర్ణయించారు. అది కూడా కార్యకర్తల అభీష్టం మేరకే జరగాల్సి ఉంది. ఇప్పటి వరకూ జరిగిన సంస్థాగత ఎన్నికలకు భిన్నంగా ఈ విధివిధానాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ సమావేశాలు నిర్వహించి అధినాయకులు తమ ఆలోచన మేర ఒక వ్యక్తిని ప్రతిపాదించడం, ఇష్టం ఉన్నా లేకున్నా నాయకులు, కార్యకర్తలు చపట్లు కొట్టి ఆ ప్రతిపాదనను ఆమోదించడం జరుగుతోంది. పదవిపై ఆశ ఉన్నా ఆశావహులు పెదవి విప్ప లేని స్థితి కొనసాగుతూ వస్తున్నది. అలా ఎన్నిక కాబడిన చాలామంది రెండు దశాబ్దాల పాటు మండల, గ్రామ పార్టీ అధ్యక్ష పదవులు చేపట్టిన దాఖలాలు ఉన్నాయి. ఈ విధానాలకు స్వస్తి చెప్పి పార్టీ ఏ ఒక్కరిదీ కాదని, పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ హక్కు, బాధ్యత ఉంటుందని ఈ బుక్‌లెట్‌లోని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కార్యకర్తకు బలం, గౌరవం అందించడమే ముఖ్య ఉద్దేశ్యంగా ఈ నిబంధనలు తీసుకున్నట్టు అందరూ భావిస్తున్నారు.

ఉత్కంఠగా యువ నాయకత్వం..

పార్టీ పదవి ఒక్కసారి దక్కితే చాలు శాశ్వతంగా వారే కొనసాగుతున్నారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఇరవై ఏళ్లకు పైబడి పదవుల్లో కొనసాగినవారున్నారు. చివరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వారిని పేరుతో కంటే మండల ప్రెసిడెంట్, టౌన్ ప్రెసిటెండ్ అని పిలిచేంతగా వారు ఆ పదవులు పట్టుకొని కొనసాగారు. మొత్తం మీద యువనేత నిర్ణయంతో పార్టీలో కొత్త వ్యక్తులు, యువతరానికి పగ్గాలు అందనున్నాయి. ఇప్పటికే ఆయా పదవులకు ఆశావహులు ఉన్నప్పటికీ ఎమ్మెల్యేల ఆలోచనలకు ఎదురు చెప్పలేక మిన్నకుండి పోయారు. ఇప్పుడు అవకాశం అంది రావడంతో ఆశావహులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నందిగామ నియోజకవర్గంలో గణనీయ మార్పులు

నందిగామ నియోజకవర్గంలో ఇప్పటికే గ్రామ, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుల ఎన్నికలు పూర్తయ్యాయి. ముందు నుంచీ యువనేత చెబుతున్నప్పటికీ పాతవారినే కొనసాగిస్తూ నియామకం చేపట్టారు. ఈక్రమంలో కంచికచర్ల మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కోగంటి బాబు సుమారు 15 ఏళ్లుగా పదవిలో కొనసాగుతున్నారు. చందర్లపాడు మండల అధ్యక్షుడు మేకల సుధాకర్ 11 ఏళ్ల నుంచి పదవిలో కొనసాగుతున్నారు. వీరులపాడు మండల అధ్యక్షుడు కొర్లకుంట శ్రీనివాసరావు ఆరేళ్లుగా ఆ పదవిలో ఉన్నారు. వీరితో పాటు కంచికచర్ల పట్టణ అధ్యక్షుడిగా ఉన్న వేమా వెంకట్రావు సుదర్ఘ కాలంగా పదవిలో కొనసాగుతున్నారు. పార్టీ కొత్త నిబంధనల ప్రకారం వీరంతా పదవుల నుంచి తప్పుకోక తప్పని పరిస్థితి. నందిగామ పట్టణ, మండల అధ్యక్షులు చివరిదశకు చేరుకున్నారు. పట్టణ అధ్యక్షుడు ఏచూరి రామకృష్ణ, కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు వీరంకి వీరస్వామిలు ఐదేళ్లుగా పదవుల్లో కొనసాగుతున్నారు. నిబంధనల ప్రకారం వీరికి మరోమారు కొనసాగే అవకాశం ఉంది.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో..

జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన మేకా వెంకటేశ్వర్లు పదేళ్లుగా పదవిలో కొనసాగుతున్నారు. మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు 12 సంవత్సరాలుగా పదవిలో ఉన్నారు. వత్సవాయి మండల అధ్యక్షుడు ఆరేళ్లు పూర్తి చేసుకొని ఏడో సంవత్సరంలో కొనసాగుతుండగా, పెనుగంచిప్రోలు మండల అధ్యక్షుడిగా చింతల సీతారామయ్య రెండు దశాబ్దాలుగా పదవిలో కొనసాగుతున్నారు. ఏళ్ల తరబడి పదవులు వీడకుండా ఉన్న వీరిపై పార్టీ శ్రేణుల్లో ఒకింత అసంతృప్తి కూడా ఉంది. వీరంతా ఆరుపదుల వయస్సు దాటిన వారే. దీంతో కొత్త తరం పార్టీ నాయకులు, కార్యకర్తలు వారితో కలిసి నడవలేక పోతున్నారు. సంస్థాగత ఎన్నికలకు ముందే యువనేత లోకేశ్ ఈ ప్రతిపాదన మౌఖికంగా ప్రకటించినా ఎమ్మెల్యేలు సాంప్రదాయాన్ని వీడకుండా పాతవారినే కొనసాగించారు.



కలెక్టర్ లక్ష్మీశ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

దుర్గమ్మ సేవలో కలెక్టర్ దంపతులు

ఇంద్రకీలాద్రి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలను అందజేసి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు వారికి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

దేవదాయ కమిషనర్‌ను కలిసిన ఈవో



ఇంద్రకీలాద్రి: దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్‌ను దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దేవస్థానం అభివృద్ధి పనులు, ఆషాఢమాస ఉత్సవాలు, భక్తుల అభిప్రాయ సేకరణ ద్వారా సంతృప్తిస్థాయి వివరాలు తదితరాలపై కమిషనర్‌కు ఈవో శీనానాయక్ వివరించారు.



చంద్రబాబును కలిసి వివరిస్తున్నయోగాసనా స్పోర్ట్స్ ప్రతినిధులు

సీఎంను కలిసిన యోగాసన స్పోర్ట్స్ ప్రతినిధులు

పటమట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గౌరవాధ్యక్షులు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో యోగాసన స్పోర్ట్స్ ప్రతినిధులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఏడాది యోగాసన పోటీలు, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణపై సీఎంతో చర్చించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ పొందిన అథ్లెట్స్ యోగా మాస్టర్లు, కోచ్‌లు యోగాంధ్రాలో వారు పొల్గొన్న వివరాలను సీఎంకు వివరించగా సీఎం ప్రత్యేకంగా అభినందించినట్టు గొట్టిపాటి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు రాధిక, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, జాయింట్ సెక్రటరీ తేజలు పాల్గొన్నారు.

రెండో పీఆర్సీ విడుదల చేయండి

- సహకార సంఘ ఉద్యోగుల వినతి



తిరువూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 2019-2024 రెండో పీఆర్సీని వెంటనే విడుదల చేయాలని కోరుతూ, పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం చీఫ్ సెక్రటరీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, సహకార సంఘాల ఉద్యోగుల రెండో వేతన సవరణ పెండింగ్‌లో ఉన్నప్పటికీ, నేటికీ సరైన నిర్ణయం తీసుకోలేదన్నారు. రెండో పీఆర్సీ వేతన బకాయిలు వెంటనే అందజేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చినట్టు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్, కోశాధికారి కొండలశర్మ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ నరసింహారావులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరనగర్‌లో నదీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పట్టాభి

భవన వ్యర్థాలను డంప్ చేస్తే కఠిన చర్యలు

పటమట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నదీ ప్రవాహానికి ఆటంకం కలిగిస్తూ పర్యావరణానికి నష్టం చేకూర్చేలా భవన నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా డంప్‌చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. 'నదిలో అడ్డుకట్ట' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించి గురువారం రామలింగేశ్వర్‌నగర్ ప్రాంతాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డంపింగ్ విధానాన్ని అడ్డుకోకుండా అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలో నగరంలోని బిల్డర్స్ అసోసియేషన్‌తో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విజయవాడలో ఆగిపోయిన కన్‌స్ట్రక్షన్ డిమోలేషన్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నగరంలో ఎవరైనా అక్రమంగా భవన నిర్మాణ వ్యర్థాలను నదీ పరివాహక ప్రాంతాల్లో డంప్ చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీగా అపరాధ రుసుం విధించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈఈ సామ్రాజ్యం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో గోపాల నాయక్‌లు పాల్గొన్నారు.

తిరుపతమ్మ దేవస్థానాన్ని సందర్శించిన దేవదాయ జేసీ భ్రమరాంబ

పెనుగంచిప్రోలు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ జాయింట్ కమిషనర్ భ్రమరాంబ గురువారం తిరుపతమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో పారిశుధ్యం, ప్రసాదాల తయారీ, సీసీ కెమేరా పర్యవేక్షణ, ప్రసాదాల తయారీకి వాడే సరుకుల విభాగాలను తనిఖీ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించిందని ఇందులో భాగంగా ఈ పర్యటన చేసినట్టు చెప్పారు. ఆలయంలో పారిశుధ్యం, ప్రసాదాల తయారీ, సీసీ కెమేరాలు పనితీరు, సరుకులను ఆమె పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ముందుగా ఆమె తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ కిషోర్ కుమార్, ఈఈ ఎల్.రమ తదితరులు ఆమె వెంట ఉన్నారు.



తిరుపతమ్మ దేవస్థానం వద్ద వివరాలు తెలుసుకుంటున్న జేసీ భ్రమరాంబ



రామచంద్రాపురంలో రహదారిపై నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

జాతీయ రాహదారి పనులు పూర్తి చేయండి

ఎ.కొండూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విజయవాడ-భద్రాచలం జాతీయ రహదారి(30) పనులు వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు మాట్లాడుతూ, గ్రామంలో సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం చేయకుండా పదేళ్లుగా కాలయాపన చేస్తున్నారన్నారు. రహదారిపై వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగించడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడినట్టు తెలిపారు. దుమ్ము, కాలుష్యం కారణంగా ప్రజలు శ్వాసకోశ వ్యాధులకు గురవైవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో నీరు గుంతలోకి చేరి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్లు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణం రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని, లేకుంటే రహదారిపై వంటవర్పు, దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో అమ్మిరెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంటేశ్వరరావు, లక్ష్మయ్య, నాగరాజు, స్వాములు, రాధమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, చెన్నుబోయిన చిట్టిబాబు తదితరులు

అవగాహనతో సికిల్ సెల్ నియంత్రణ

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అవగాహనతోనే సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని నియంత్రించవచ్చని, దీనిపై జూన్ 19 నుంచి పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. 'ప్రపంచ సికిల్ సెల్ దినం' సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కొండపల్లి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో సికిల్ సెల్ వ్యాధి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆయన ప్రజాప్రతినిధులు ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్‌లో భాగంగా వ్యాధికి సంబంధించి వివిధ వర్గాల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. సాధారణంగా ఆరోగ్యకరమైన ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉంటే సికిల్ సెల్ వ్యాధిలో ఈ కణాలు కొడవలి ఆకారంలో ఉంటాయని వివరించారు. ఈ వ్యాధి తల్లిదండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందన్నారు. రక్త పరీక్ష ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చన్నారు. ఈవ్యాధి ఉన్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సకాలంలో గుర్తించి సరైన వైద్యం అందించడం ద్వారా రోగి జీవన ప్రమాణాలను పెంచవచ్చని తెలిపారు. రాబోవుతరాలకు వ్యాధి వ్యాపించకుండా నిరోధించాలంటే సరైన అవగాహన ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీటీడబ్ల్యూవో విజయశాంతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మాధవి, వైద్యాధికారులు పద్మావతి, విజయకుమార్, నోడల్ అధికారి డాక్టర్ నవీనా, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ఇంటెలిజెంట్ సిస్టమ్స్ డిజైన్‌పై అవగాహన సదస్సు

మైలవరం టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో గురువారం 'ఇంటెలిజెంట్ సిస్టమ్స్ డిజైన్ రియల్-వరల్డ్ ఇన్‌సైట్స్' అంశంపై అధ్యాపకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రొఫెసర్స్ ఎస్.రామనారాయణరెడ్డి, ఇందిరా గాంధీ ఢిల్లీ టెక్నికల్ యూనివర్సిటీ ఫర్ ఉమెన్ ఈఎస్ఈ విభాగం సిబ్బంది రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.అప్పారావు మాట్లాడుతూ, వర్క్‌షాప్‌లో అధ్యాపకులు పాల్గొని వాటిలో అంశాలను నేర్చుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని తద్వారా వారికి మంచి భవిష్యత్తును ఇచ్చినవారమవుతామన్నారు. కార్యక్రమానికి ఎస్.నాగార్జునరెడ్డి(కన్వీనర్, హెచ్‌ఓడీ,సీఎస్ఈ) సమన్వయకర్తలు,సిహెచ్.వెంకటనారాయణ(కో-కన్వీనర్) ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు డి.అనిల్‌కుమార్, ఎం.గాయత్రి వ్యవహరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

బఫర్ ఆఫర్!



- పరిటాల మైనింగ్ ఏరియాలో అధికారిక లే అవుట్లా?
- బఫర్ జోన్‌లో అనుమతులిచ్చేసిన సీఆర్‌డీఏ అధికారులు
- 500 మీటర్ల పరిధి వరకు అనుమతి ఇవ్వకూడదనేది నిబంధన
- స్టోన్ క్వారీ పేలుళ్లతో ఏర్పడే కాలుష్యం కారణంగానే..
- ఇక్కడ ఇళ్లు నిర్మించుకుంటే ప్రమాదకర పరిస్థితులే..
- అయినా అనుమతులిచ్చిన సీఆర్డీఏపై విమర్శలు

పరిటాల ఇండస్ట్రియల్-మైనింగ్ ఏరియా బఫర్ జోన్ పరిధిలో రెసిడెన్షియల్ లే అవుట్లకు సీఆర్‌డీఏ అనుమతులు ఇవ్వటం వివాదాస్పదంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా, న్యాయస్థానం ఆదేశాలను ఖాతరు చేయకుండా అనుమతులు ఎలా ఇస్తారనే ప్రశ్నలు వస్తున్నాయి. ప్లానింగ్ విభాగంలోని అవినీతి అధికారులు కొందరు కాసులకు కక్కుర్తి పడి ఇలా అనుమతులు ఇచ్చారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఓవైపు రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఈ పనులకు కంకర అంతా పరిటాల నుంచే తీసుకెళ్లేందుకు కాంట్రాక్టు సంస్థలు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఇలాంటి తరుణంలో పరిటాలలోని బఫర్ జోన్ పరిధిలో రెసిడెన్షియల్ లే అవుట్లకు సీఆర్‌డీఏ అధికారులు అనుమతులు ఇవ్వడం వివాదాస్పదమవుతోంది.

అదంతా క్రషింగ్ ఏరియా

పరిటాలలో ఉన్న మెటల్స్ కారణంగా దశాబ్దాల కిందటే ఇక్కడ స్టోన్ క్రషింగ్, ఇండస్ట్రియల్స్‌కు అనుమతులు ఇచ్చారు. కాగా, సర్వే నెంబర్ 801లో 1,300 ఎకరాల రెవెన్యూ భూముల్లో మెటల్, గ్రావెల్ క్వారీలకు అధికారికంగా అనుమతులు ఇచ్చారు. ఇదే ప్రాంతంలో పలు యూనిట్లు కూడా ఏర్పాటయ్యాయి. అప్పట్లో కాలుష్య నియంత్రణ మండలి నుంచి తీసుకున్న అనుమతుల మేరకు ఈ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన క్రషింగ్ యూనిట్ల ద్వారా రోడ్డు, బిల్డింగ్ మెటల్‌ను తయారుచేసి ఎగుమతి చేస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, నరసరావుపేట, ఉమ్మడి గోదావరి జిల్లాలకు ఇక్కడి నుంచే బిల్డింగ్, రోడ్డు మెటల్ పెద్ద ఎత్తున ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం రాజధాని అమరావతి నిర్మాణ పనుల నేపథ్యంలో అవసరాలకు అనుగుణంగా బిల్డింగ్ మెటల్ అంతా ఇక్కడి నుంచే వెళ్లనుంది.

నివాసయోగ్యమేనా?

ఇప్పటికే బఫర్ జోన్ వెలుపల ఉన్న రైతులు తమ పొలాల్లోకి దుమ్ము ధూళి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటపుడు బఫర్ జోన్ పరిధిలో నివాస లే అవుట్లకు అనుమతులు ఇస్తే కాలుష్యం బారిన పడే ప్రమాదం ఉంది. ఇక్కడ నివసిస్తున్న వారు అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది. కాలుష్య జోన్‌లో ఉండేచోట నివాసాలకు అనుమతులు ఇవ్వకూడదు. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టేలా సీఆర్‌డీఏ అధికారులు వ్యవహరించిన తీరు విమర్శలకు దారితీస్తోంది. జనావాసాలు లేనిచోట స్టోన్ మెటల్స్ యూనిట్లకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలి. అప్పుడు స్థానికంగా బిల్డింగ్ మెటల్ అన్నది అందుబాటులో ఉండదు. స్థానికంగా బిల్డింగ్ మెటల్ ఉత్పత్తి అయితే ధరలు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ బిల్డింగ్ మెటల్ అందుబాటులో లేకపోతే దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. దిగుమతి కారణంగా అమాంతం బిల్డింగ్ మెటల్ ధరలు పెరిగిపోతాయి.

బఫర్ జోన్ నిబంధనలు మరిచారా?

మైనింగ్ జోన్లకు సంబంధించి ప్రభుత్వం 153 జీవోను విడుదల చేసింది. దీనిప్రకారం క్వారీలు, స్టోన్ క్వారీయింగ్‌ను నిర్వహించటానికి ఆయా వనరులు ఉన్న ప్రదేశం జనావాసాలతో సంబంధం లేకుండా ఉండాలి. ఆ తర్వాతే వాటిని మైనింగ్ జోన్‌లోకి తీసుకురావాలి. ఈ మైనింగ్ జోన్ చుట్టూ బఫర్ జోన్ ఉంటుంది. పరిటాల గ్రామంలోని సర్వే నెంబర్ 801లో మైనింగ్ బఫర్ జోన్ పరిధి ప్రస్తుతం 500 మీటర్ల వరకు ఉంది. ఈ పరిధిలో ఎలాంటి రెసిడెన్షియల్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదు. దీనిపై గతంలో ఇక్కడి నిర్వాహకులంతా కలిసి బఫర్ జోన్ నిడివి 800 మీటర్ల పరిధి వరకు పెంచాలని డిమాండ్ చేశారు. సీఆర్‌డీఏ అధికారులకు కూడా స్టోన్ యూనిట్స్ నిర్వాహకులు లేఖలు రాశారు. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకుంటే తప్ప ఈ వివాదానికి చెక్ పడే అవకాశం లేదు.

కాకినాడ టౌన్-చర్లపల్లి-లింగంపల్లి మధ్య

ప్రత్యేక రైళ్లు



రైల్వే స్టేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని కాకినాడ టౌన్-చర్లపల్లి, కాకినాడ టౌన్-లింగంపల్లి మధ్య ప్రత్యేక వీక్లీ రైళ్లను నడుపుతున్నారు. 07447 కాకినాడ టౌన్-చర్లపల్లి శనివారం నడుస్తుంది. కాకినాడలో రాత్రి 8.10కి బయలుదేరి మరునాడు ఉదయం 8.30కు చర్లపల్లికి చేరుతుంది. జులై 5 నుంచి మార్చి 28 వరకు ఈ రైలు నడుస్తుంది. 07448 చర్లపల్లి-కాకినాడ టౌన్ ఆదివారాలలో నడుస్తుంది. చర్లపల్లిలో రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరునాడు ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుతుంది. జులై 6నుంచి మార్చి 29 వరకు ఈరైలు నడుస్తుంది. 07445 కాకినాడ టౌన్-లింగంపల్లి సోమ, బుధ, శుక్రవారాలలో నడుస్తుంది. రాత్రి 8.10కి కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరునాడు ఉదయం 8.50గంటలకు లింగంపల్లి చేరుకుంటుంది. జులై 2 నుంచి మార్చి 30 వరకు ఈ రైళ్లు నడుస్తాయి. 07446 లింగంపల్లి-కాకినాడ టౌన్ మంగళవారం, గురువారం, శనివారాల్లో నడుస్తుంది. సాయంత్రం 6.30 గంటలకు లింగంపల్లిలో బయలుదేరి మరునాడు ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్ చేరుతుంది. జులై 3నుంచి మార్చి 31వరకు ఈ రైలు నడుస్తుంది. చర్లపల్లి-కాకినాడ టౌన్ ప్రత్యేక రెలు సామర్లకోట, రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, ఆకువీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్‌లలో ఆగుతుంది. వన్‌ఏసీ, టూఏసీ, త్రీఏసీ, త్రీఏసీ ఎకానమీ, స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లు ఇందులో ఉంటాయి. కాకినాడ టౌన్-లింగంపల్లి రైలు సామర్లకోట, రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, ఆకువీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, చర్లపల్లి స్టేషన్‌లలో ఆగుతుంది. ఈరైలులో వన్ ఏసీ, టూఏసీ, త్రీఏసీ, త్రీఏసీ ఎకానమీ, స్లీపర్, జనరల్, సెకండ్‌క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

గోల్కొండ ఎక్స్‌ప్రెస్ సమయాల్లో మార్పు..

సికింద్రాబాద్-గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడ, కృష్ణాకెనాల్ స్టేషన్‌లలో ఆగే సమయాలలో స్వల్ప మార్పులు చేశారు. 17202 సికింద్రాబాద్, గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 23 నుంచి విజయవాడ, కృష్ణాకెనాల్ స్టేషన్‌లలో ఆగే సమయాలలో మార్పు చేశారు. నిత్యం నడిచే ఈ రైలు విజయవాడలో ప్రస్తుతం రాత్రి 7 గంటలకు వచ్చి 7.10కి బయలుదేరుతుంది. ఈ సమయంలో మార్పు దృష్ట్యా రాత్రి 7.20కి వచ్చి 7.30కి బయలుదేరుతుంది. కృష్ణాకెనాల్‌లో ప్రస్తుతం ఈరైలు రాత్రి 7.18కి వచ్చి 7.20కి బయలుదేరుతుంది. అయితే దీనిని రాత్రి 7.38కి వచ్చి, 7.40కి బయలుదేరేలా మార్పు చేశారు.

నేటి నుంచి పాలీసెట్ కౌన్సెలింగ్

గుడ్లవల్లేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పాలీసెట్ - 2025 ధ్రువపత్రాల పరిశీలన హెల్ప్‌లైన్ సెంటర్‌గా గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్‌ను ప్రకటించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా పాలీసెట్-2025 ర్యాంకు సాధించి ధ్రువపత్రాలను పరిశీలనకు హాజరయ్యే విద్యార్థులు ముందుగా ఈ నెల 20 నుంచి 27 లోపు ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 700లు, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులు రూ.250 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ర్యాంక్ ఆధారంగా ప్రభుత్వం కేటాయించిన తేదీల్లో కళాశాలలో నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియలో పాల్గొనాలన్నారు. జూన్ 25 నుంచి వెబ్ ఆప్షన్ ఎంట్రీ చేసుకోవచ్చని, అది పూర్తయిన వారికి జూలై 3న అలాట్మెంట్ నిర్ణయిస్తారని తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలను హెచ్‌టీటీపీఎస్:పాలీసెట్.ఎపి.జీవి.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెచ్చుకోవలసిన ధ్రువపత్రాలు

ప్రాసెసింగ్ ఫీజ్ పేమెంట్ రశీదు, ఏపీపాలీసెట్-2025 హాల్ టికెట్, ర్యాంక్‌కార్డు, ఎస్ఎస్‌సి మార్కుల మెమో, టీసీ, నాల్గవ తరగతి నుంచి పదోతరగతి వరకూ స్టడీ, బోనఫైడ్ సర్టిఫికెట్, కులధృవీకరణ పత్రాలు (ఎస్సీ, ఎస్టీ, బీసీ)ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఓసీ విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఉన్నవారు తీసుకొనిరావాలి సూచించారు.

ధ్రువపత్రాల పరిశీలన ర్యాంకుల వారీగా..

జూన్ 21వ తేదీన (1-15000), 22న (15001-32000), 24న (32001-50000), 25న (50001-68000), 25న (68001-86000), 26న (86001-104000), 27న (104001-120000), 28న (120000 నుంచి చివరి ర్యాంక్ వరకు).

వెబ్ ఆప్షన్లు : జూన్ 25, 26 తేదీల్లో (01 -50000), 27, 28 తేదీల్లో (50001-90000), 29, 30 తేదీల్లో (90001 నుంచి చివరి ర్యాంక్ వరకు). జూలై 1న వెబ్ ఆప్షన్ మార్చుకొనేందుకు అవకాశం ఉంటుంది.

జీఓ నెం.5 ఉపసంహరించాలని

సచివాలయ ఉద్యోగుల నిరసన

జగ్గయ్యపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదలీలపై జీవో నెం.5ను ఉపసంహరించాలని కోరుతూ ఉద్యోగులు భోజన విరామ సమయంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏ ఉద్యోగులకు లేని నిబంధన, ఆంక్షలు తమకు ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో 14 వార్డు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	106, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

అన్నదాత సుఖీభవ ఈకేవైసీ అప్‌డేట్ పూర్తి

హనుమాన్‌జంక్షన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బాపులపాడులో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన 9,058 మంది రైతుల ఈకేవైసీలను అప్‌డేట్ పూర్తి చేసినట్టు మండల వ్యవసాయాధికారి బి. రంగనాథబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలో 21వేల మంది రైతులు ఉండగా అందులో ఆరు అంచెల వడత పోతలో 9,058 మంది రైతులు మాత్రమే అర్హులుగా ఉన్నారన్నారు. వారందరి ఈకేవైసీలు అప్‌డేట్ చేసే కార్యక్రమం పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు. తొలివిడత రైతు భరోసా శుక్రవారం నుంచి రైతుల ఖాతాలో జమ కానున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గన్నవరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరపనేనిగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వీరపనేనిగూడెం 33/11 కేవీ మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం 7.30 నుంచి మధ్యాహ్నా 12గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ వెంకటరాజు పేర్కొన్నారు. ఆ సబ్ స్టేషన్ పరిధిలోని తెంపల్లి, బల్లిపర్రు, మెట్లపల్లి, కొత్తగూడెం, చింతగుంట, చిక్కవరం, కండ్రిక, గొల్లనపల్లి, బీబీగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మాచవరం దాసాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.9.8 లక్షలు

గుణదల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.9.8లక్షలు నగదు రూపంలో రాగా 21 అమెరికన్ డాలర్లు వచ్చాయని ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి తెలిపారు. మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. 3 నెలల 6 రోజులకు భక్తులు మొక్కుబడుల రూపంలో వేసిన కానుకలను గురువారం లెక్కించినట్లు ఈవో తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కింపు జరిగిందని చెప్పారు. హుండీల్లో వెండి, బంగారు ఆభరణాలు రాలేదని తెలిపారు.

క్షయపై అప్రమత్తత అవసరం

ఉంగుటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : క్షయ(టీబీ)వ్యాధి పట్ల ప్రజలకు అవగాహనతోకూడిన అప్రమత్తత చాలా అవసరమని, చికిత్స ద్వారా ఈవ్యాధిని పూర్తిగా నివారించవచ్చునని పెదఅవుటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కరీముల్లా మొహీనుద్దీన్ అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పొట్టిపాడు శివారు గ్రామమైన ఆనందపురంలో క్షయవ్యాధి నివారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వారంరోజుల పైబడి తెమడతో కూడిన దగ్గు, అందులో రక్తం పడటం, జ్వరం, ఛాతిలో నొప్పి, ఆకస్మికంగా బరువు తగ్గటం, తీవ్రఅలసట/నీరసం వంటి లక్షణాలు కన్పిస్తే వైద్యుల సలహామేరకు మందులు క్రమం తప్పకుండా వాడితే టీబీ వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు.

అతిసారం(డయేరియా)వ్యాధిపట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

వర్షాకాలంలో కలుషితనీరు, వైరస్, బ్యాక్టీరియాల ప్రభావం వల్ల పిల్లల్లో అతిసార(నీళ్లవిరేచనాలు)వ్యాధి ప్రబలే అవకాశాలు ఎక్కువగా వున్నాయని, ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా(అతిసారం)బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ కరీముల్లా తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం టీబీ అంతం-మనందరి పంతం, టీబీని దాచకూడదు-ఓడించాలి, అతిసారవ్యాధి నుండి పిల్లలను రక్షించండి అనే నినాదాలు చేస్తూ క్షయ, అతిసారం వ్యాధులపై గ్రామప్రధాన వీధుల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, సీహెచ్‌వో ఎస్.రామారావు, ఆశావర్కర్లు, ఆరోగ్యవైద్యసిబ్బంది పాల్గొన్నారు.



పొట్టిపాడు శివారు ఆనందపురంలో క్షయ, డయేరియా వ్యాధి నిర్మూలనపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యవైద్యసిబ్బంది

రైతులకు ప్రభుత్వ పథకాలు చేరువ చేయడమే లక్ష్యం

● వ్యవసాయ అధికారి బి.రంగనాథబాబు

హనుమాన్‌జంక్షన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు చేరువ చేస్తూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో మెరుగైన సేవలు అందించడానికి కృషి చేద్దామని బాపులపాడు మండల వ్యవసాయ అధికారి బి.రంగనాథబాబు తెలిపారు. మండల వ్యవసాయ అధికారిగా నియమితులైన రంగనాథబాబు, ఉద్యాన వన శాఖాధికారిగా నియమితులైన జోసెఫ్ సుందరానికి ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన జె.భవానీ, హరిశ్చంద్రలు గురువారం రికార్డులు అప్పగించారు. ఈ సందర్భంగా మండలంలోని వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బందితో కార్యాలయంలో వ్యవసాయాధికారి రంగనాథబాబు సమావేశం నిర్వహించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం రైతులు వరి నారుమళ్లు పోస్తున్నారు. నారుమళ్ల పెంపకంలో రైతులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు.



మండల వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఏవో రంగనాథబాబు

శ్రమశక్తి ఆవార్డు గ్రహీత పల్లా సింహాచలం సేవలు నిరుపమానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : కార్మిక సంఘ నాయకుడిగా, మాజీ ఎమ్మెల్యేగా ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్మికులకు పల్లా సింహాచలం అందించిన సేవలు నిరుపమానమని ఎన్ఎస్ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. విశాఖపట్నంలోని సీతంపేటలో పల్లా నివాసంలో గురువారం సింహాచలం చిత్రపటానికి నివాళులర్పించి, కుమారుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, సామాజిక, రాజకీయ రంగాల్లో విశిష్ట సేవలందిందించిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే, శ్రమశక్తి ఆవార్డు గ్రహీత పల్లా సింహాచలం ఆకాల మరణం కార్మిక రంగానికి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సుజయ కృష్ణరంగారావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యన్నారాయణ పాల్గొని నివాళులర్పించారు.



పల్లా సింహాచలం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్ఎస్ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



బోల్తా పడ్డ టిప్పరును లేపుతున్న పొక్లెయిన్

టిప్పర్‌ను ఢీకొన్న కారు

● తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

పెనమలూరు, జూన్19(ఆంధ్రజ్యోతి): కంకరు చిప్స్ లోడుతో వెళుతున్న టిప్పరును ఓవర్‌టేక్ చేయబోయిన కారు ప్రమాదానికి గురైన ఘటన బందరు జాతీయ రహదారిపై గంగూరు జంక్షన్ వద్ద గురువారం చోటుచేసుకుంది. పెనమలూరు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాల మేరకు..విజయవాడ వైపు నుంచి బందరు కంకరు చిప్స్‌లోడుతో వెళుతున్న టిప్పరును ఎడమ వైపు నుంచి అదే దిశలో వెళుతున్న కారు ఓవర్‌టేక్ చేయబోతూ ఎదురుగా ఆటో ఉండడంతో అదుపు తప్పి టిప్పరును ముందు భాగంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో టిప్పరు డ్రైవరు సడెన్ బ్రేక్ వేయడంతో టిప్పరు అదుపు తప్పి బందరు రోడ్డు గంగూరు సెంటరు వద్ద బోల్తా కొట్టింది. ప్రమాదంలో టిప్పరు డ్రైవరు, కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు క్షేమంగా బయటపడ్డారు. టిప్పరులోని కంకరు చిప్స్ అంతా బందరు రోడ్డుపై పడడంతో కాసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుల సమాచారం మేరకు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తన సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు. పొక్లెయిన్ తెప్పించి బోల్తాపడ్డ టిప్పరును, కారును పైకిలేపి ప్రక్కన పెట్టించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈఘటనలో ఎవరికీ ఏమీ అవకపోవడంతో స్థానికులు పీల్చుకొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



మానికొండలో దివ్యపూజాబలిని సమర్పిస్తున్న పీఠాధిపతి తెలగతోటి జోసెఫ్ రాజారావు

సమైక్యతాభావంతోనే ప్రపంచశాంతి సాధ్యం

● విజయవాడ మేత్రాసనం పీఠాధిపతులు తెలగతోటి జోసెఫ్ రాజారావు

ఉంగుటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మానవుల మధ్య సోదరతత్వం, సమైక్యతాభావం పెంపొందినపుడే ప్రపంచశాంతి పరిఢవిల్లుతుందని విజయవాడ మేత్రాసన పూజ్య పీఠాధిపతులు(బిషప్)తెలగతోటి జోసెఫ్ రాజారావు అన్నారు. గురువారం మానికొండలో రెవరెండ్ ఫాదర్ చింతగుంట ఇన్నయ్య, చింతగుంట జోజయ్య సోదరుల ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమష్టి దివ్యపూజాబలిని సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ విద్వేషాలు, వైరుధ్యాలు లేకుండా మానవులంతా శాంతియుతంగా జీవిస్తూ సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఫాదర్ ఇన్నయ్య, జోజయ్య సోదరులు సమాజాన్ని ఆధ్యాత్మికంగా ముందుకు నడిపించడంలో చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. వారుచూపిన బాటలో కుమారులు నడుస్తూ విద్యావ్యాప్తికి తమవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా జోజయ్య విగ్రహాన్ని చెన్నైకి చెందిన ప్రముఖ న్యాయవాది వినోద్ ఫెర్నాండ్ ఆవిష్కరించారు. అనంతరం 240మంది పేద విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ బెల్జియం, జోజయ్య కుమారులు ఫాదర్ సురేష్‌బాబు, సతీష్‌బాబు, కిషోర్‌బాబు, వివిధ ప్రాంతాల విచారణలకు సంబంధించిన మత గురువులు, విశ్వాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డ్యూటీ డాక్టర్, సిబ్బందిపై దాడి

గుడివాడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్న డ్యూటీ డాక్టర్, హెడ్‌నర్సు, సిబ్బందిపై నలుగురు వ్యక్తులు దాడిచేసి నానాబీభత్సం సృష్టించారు. బుధవారం రాత్రి ఆసుపత్రిలో డాక్టర్ ఎ.కె. గిరీశ్, హెడ్ నర్సు, నర్సులు విధుల్లో ఉన్నారు. రాత్రి సుమారు 12.45గంటల సమయంలో కార్తికేయ అనే వ్యక్తి విషం తాగడంతో అతని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్చారు. వైద్యం చేస్తుండగా నలుగురు వ్యక్తులు వచ్చి, కార్తికేయను వేరే ఆసుపత్రికి తరలిస్తామని వైద్యుడు గిరీష్‌తో వాదులాటకు దిగారు. బాధితుడికి చికిత్స జరుగుతుందని, గొడవలొద్దని వారించిన వారు వినలేదు. సంతకాలు చేసి కార్తికేయను తీసుకువెళ్లమని వైద్యుడు గిరీశ్ వారిని కోరాడు. దీంతో కోపోద్రిక్తులైన నలుగురు వైద్యుడు గిరీశ్, హెడ్ నర్సు, సిబ్బందిపై దాడి చేసి గాయపరిచారు. డాక్టర్ గిరీశ్ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ రామయ్య తెలిపారు.

యోగా శిక్షణకు 15,977 మంది రిజిస్ట్రేషన్

ఉయ్యూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న జరిగే యోగా కార్యక్రమానికి మండలంలో 15977 మంది శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి కమిటీ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ యోగా శిక్షణకు 15,977 మం ది రిజిస్ట్రేషన్ చేయించుకోవడం యోగాపై ప్రజల్లో అవగాహనకు నిదర్శనమన్నారు. ఈ నెల 21న అన్ని గ్రామాల సచివాలయాల్లో అన్ని పాఠశాలల్లో 103 చోట్ల యోగా సాధకులతో ఉదయం 6 నుంచి యోగా కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో విశ్వశాంతి స్కూల్‌లో 6వేల మందితో యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారని తెలిపారు.



సమావేశములో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరిరావు

లిఫ్టు తెగిపడి ముగ్గురికి గాయాలు

లబ్బీపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లిఫ్టు తెగిపడి ముగ్గురు గాయపడిన సంఘటన లబ్బీపేటలోని రమా క్లాత్ షోరూంలో గురువారం జరిగింది. రమా క్లాత్ షోరూం 4వ ఫ్లోర్‌కి సరుకు తీసుకువెళ్లేందుకు ఒక లిఫ్టు ఉంది. 4వ అంతస్థులో షెడ్డు వేసేందుకు సంబంధించిన రాడ్లను పెట్టుకొని ఇద్దరు వెల్డింగ్ కార్మికులు, షోరూం ఉద్యోగి లిఫ్టులో వెళుతుండగా చైన్ తెగి కిందపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలవగా చికిత్స నిమిత్తం హాస్పటల్‌కి తరలించారు.

విద్యకు పేదరికం ఆటంకం కాదు

ఉయ్యూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలనుకునే విద్యార్థులకు పేదరికం ఆటంకం కారాదని, ప్రోత్సహించి ముందుకు నడిపించేందుకు దాతృత్వం కలవారు ఎల్లప్పుడు వారితో ఉంటారని ఏజీఅండ్ఎస్‌జీఎస్ జూనియర్ కళాశాల డైరెక్టర్ జీజేపీ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. కళాశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులకు ఇన్నర్ వీల్‌క్లబ్ అధ్యక్షురాలు నర్రా సుధారాణి ఆధ్వర్యంలో ఒకొక్కరికి రూ. 5వేలు చొప్పున పదివేల రూపాయలు ప్రోత్సాహక నగదు బహుమతి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలతో పాటు దాతలు ముందుకు వచ్చి తోచిన విధంగా సాయమందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యురాలు అన్నేరాణి తదితరులు పాల్గొన్నారు.



ఏజీఅండ్ఎస్‌జీఎస్ కళాశాల విద్యార్థినులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేస్తున్న ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు

కష్టకాలంలో జనసైనికులకు పార్టీ అండగా వుంటుంది : గరికిపాటి

ఉంగుటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కష్టకాలంలో జనసైనికులకు పార్టీ అండగా వుండి ఆదుకుంటుందని ఉమ్మడి కృష్ణాజిల్లాల జనసేన నాయకుడు, మీడియా కోఆర్డినేటర్ గరికిపాటి శివశంకర్ అన్నారు. చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి నడుము, వెన్నుపూస భాగాలు దెబ్బతినడంతో ఆపరేషన్ చేయించుకున్న పెదఅవుటపల్లికి చెందిన జనసైనికుడు తోట వెంకటేశ్వరరావును గురువారం ఆయన నివాసంలో శివశంకర్ నేతృత్వంలోని జనసేన నాయకులు పరామర్శించి, ఆరోగ్యపరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. తాపీపనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వెంకటేశ్వరరావు అరునెలలపాటు బెడ్‌రెస్ట్ తీసుకోవాలని వైద్యులు చెప్పడంతో మంచానికి పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో బాధితుని కుటుంబానికి తమ వంతు సాయంగా గన్నవరం మండల జనసైనికులు రూ.20వేల రూపాయల ఆర్థికసాయం అందించి ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో జనసేన గన్నవరం మండల అధ్యక్షుడు పచ్చిపాల లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శులు దుంపల సంధ్యారాణి, కోలవెన్ను నరసింహారావు(నాని), ఆవుల జానీ, బాలమూరు భానుప్రకాష్, మురళి, సిరాజ్, పాలపర్తి గంగావరప్రసాద్, తాడిశెట్టి దుర్గారావు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పెదఅవుటపల్లిలో జనసైనికుడు వెంకటేశ్వరరావుకు ఆర్థిక సాయం అందించి ధైర్యం చెప్తున్న జనసేన నాయకులు

నదీపాయలో తవ్వకాలు చేపట్టొద్దు

తోట్లవల్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదీపాయలో ఇసుక తవ్వకాలు చేపడితే తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం. కుసుమకుమారి హెచ్చరించారు. వల్లూరుపాలెం పాయలో బుధవారం రాత్రి జరుగుతున్న ఇసు క తవ్వకాలను మండల జనసేన పార్టీ నాయకుడు గంగిశెట్టి సత్యనారాయణ అడ్డుకున్నారు. జిల్లా కలెక్టర్‌కు, ఇతర ఉన్నతాధికారులకు పోలీసులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించానని ఆయన తెలిపారు. దీంతో తహసీల్దార్ గురువారం వల్లూరుపాలెం నదీపాయలోని లారీలు తిరిగే రహదారిపై గాడిని తవ్వించారు. అక్టోబర్ 15వ తేదీ వరకు నదీపాయల్లో ఎవరూ ఇసుక తీయటానికి వీల్లేదని, ఇసుక అవసరమైన వారు స్టాక్‌యార్డుల్లో తీసుకు వెళ్లాలని సూచించారు.



వల్లూరుపాలెం రేవులో రహదారిపై తవ్విన గాడి



కీ.శే. శ్రీమంతు రాజా యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్ గారు
మచిలీపట్నం మాజీ పార్లమెంట్ సభ్యులు

శ్రద్ధాంజలి

దేవరకోట సంస్థానాధీశులైన
యార్లగడ్డ వంశీయుల ముద్దుబిడ్డగా
జన్మించి విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించి
మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు గా
ఈ ప్రాంత ప్రజలకు ఎనలేని సేవలందించి,
చల్లపల్లి షుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్ గా
పేద రైతు కుటుబంబాలకు మరియు
కార్మిక కుటుంబాలలో వెలుగులు నింపి,
చల్లపల్లిలో శ్రీమంతు రాజా యార్లగడ్డ
శివరామ ప్రసాద్ హైస్కూల్ మరియు
జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించే
వేలాది మంది విద్యార్థులకు అన్నదాతగా,
విద్యాదాతగా సేవలందించి, చల్లపల్లి
ఎస్టేట్ దేవాలయముల ధర్మకర్తగా అనేక
ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి
ఈ ప్రాంత ప్రజలచే "చినబాబు" గారిగా
సుపరిచితులైన శ్రీమంతు రాజా యార్లగడ్డ
అంకినీడు ప్రసాద్ బహద్దూర్ గారి
మరణానికి చింతిస్తూ.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ
సభ్యులకు మా ప్రగాఢ సంతాపాన్ని
తెలియచేస్తూ...

వడ్డే శోభనాద్రీశ్వరరావు మాజీ మంత్రివర్యులు మరియు రైతు నాయకులు	**యలమంచిలి శివాజి** మాజీ పార్లమెంట్ సభ్యులు మరియు రైతు నాయకులు	**కొనకళ్ళ నారాయణరావు** APSRTC ఛైర్మన్ మరియు మాజీ పార్లమెంట్ సభ్యులు
మండలి బుద్ధప్రసాద్ అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు మరియు AP అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ ఛైర్మన్	**యార్లగడ్డ వెంకట్రావు** ప్రభుత్వ విప్ మరియు గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు	**డా. యార్లగడ్డ రమేష్‌బాబు** యం.డి. ఆయుష్ హాస్పటల్, విజయవాడ
యార్లగడ్డ సోమ శేఖర ప్రసాద్ **(లంకబాబు)** చల్లపల్లి మాజీ MPP	**యార్లగడ్డ హనుమంతరావు** ప్రొ: శ్రీలక్ష్మి జనరల్ మర్చంట్స్, చల్లపల్లి ఎరువులు, పురుగుమందుల డీలర్	(లేటు) మూల్పూరి వెంకటేశ్వరరావు గారి కుమారులు **మూల్పూరి లక్ష్మణ స్వామి** **మూల్పూరి ఉమామహేశ్వరరావు (బుజ్జి)** చల్లపల్లి
ముమ్మనేని రాజ్‌కుమార్ (నాని) ఉప సర్పంచ్, చల్లపల్లి	**నాగళ్ళ భీమారావు** ప్రిన్సిపాల్: విజయ కాన్వెంట్, చల్లపల్లి	**వేమూరి రమేష్‌బాబు** రైతు నాయకులు
మండవ బాలవర్ధిరావు AMC మాజీ ఛైర్మన్, నాగాయలంక	**మిక్కిలినేని మధు** **(S/o మిక్కిలినేని పాపారావు)** రైతు నాయకులు, చల్లపల్లి	**నాదెళ్ళ పూర్ణచంద్రరావు** ప్రొ: సాయిరాం ఎంటర్ ప్రైజెస్, IOC డీలర్, చల్లపల్లి
నాదెళ్ళ యోగ వెంకటేశ్వరరావు ప్రొ: వెంకటేశ్వర ట్రేడర్స్, చల్లపల్లి. సిమెంట్ మరియు ఐరన్ డీలర్	**సబ్బినేని బోసు** మే.పా. శ్రీసాయి ఆక్వా ఫీడ్స్, పెదకళ్ళేపల్లి రోడ్, చల్లపల్లి	**అర్జా వెంకటేశ్వరరావు** పెదకళ్ళేపల్లి
యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ ప్రొ. అభిరుచి క్యాటరింగ్, చల్లపల్లి	**యార్లగడ్డ శ్రీనివాసరావు** మేకావారిపాలెం	**యార్లగడ్డ శివప్రసాద్** కరస్పాండెంట్: విజయ జూనియర్ కళాశాల మరియు వివేకానంద డిగ్రీ కాలేజి, చల్లపల్లి

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ



యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతం చేయండి

● అధికారులతో కమిషనర్ చంద్రశేఖరరెడ్డి

పెడన, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 'అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న పెడన మునిసిపాలిటీ పరిధిలో యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణకు 112 ప్రదేశాలను ఎంపిక చేశాం. కార్యక్రమంలో పాల్గొనేందుకు రికార్డు స్థాయిలో 14 వేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, విజయవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించాలి.' అని అధికారులను మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో వివిధశాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.

పులిగడ్డ గురుకుల పాఠశాలలో..

అవనిగడ్డ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పులిగడ్డ గురుకుల విద్యాలయంలో ఆరోగ్యభారతి ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ ఎస్‌టీపీ కుమార్ పర్యవేక్షించారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



వైసీపీ నుంచి జనసేనలోకి..



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలంక గ్రామానికి చెందిన వైసీపీ నేత బళ్లా లక్ష్మణస్వామి, తన సన్నిహితులతో కలిసి గురువారం జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్యులు రాజులపాటి శ్రీనివాసరావు, దేవనబోయిన సాంబశివరావు, పెద్దిబోయిన రంగారావు, విశ్వనాథపల్లి బాబు తదితరులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. మండలి వెంకట్రామ్, గుడివాక శేషుబాబు, సిద్ధినేని అశోక్ నాయుడు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థాయి

విద్యతోనే ఉన్నత స్థాయిని చేరగలరని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో జిల్లా మొదటి ర్యాంక్ సాధించిన అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కారంకి గంగాభవాని, కాకర్ల వికాస్‌ను గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో సత్కరించారు. కారంకి గంగాభవాని విద్యాభ్యాసానికి జనసేన నాయకుడు గరికపాటి రామ వశిష్ఠ సాయమందించటంపై ఎమ్మెల్యే అభినందించారు.




బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	106, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540







రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పమిడిముక్కల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రైతుల సక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ వైస్ ఎంపీపీ, టీడీపీ నాయకుడు లింగమనేని బాబూరావు అన్నారు. గడ్డిపాడులో గురువారం కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులనుద్ధేశించి మాట్లాడారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాలు అందజేస్తుందన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు మల్లిఖార్జునరావు,సెక్రటరీ జయచంద్, బూత్ కన్వీనర్ రమేశ్, పాల్గొన్నారు.



కౌలు రైతులకు కార్డులు పంపిణీ చేస్తున్న బాబూరావు

డ్యూటీ డాక్టర్, సిబ్బందిపై దాడి

గుడివాడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్న డ్యూటీ డాక్టర్, హెడ్‌నర్సు, సిబ్బందిపై నలుగురు వ్యక్తులు దాడిచేసి నానాభీభత్సం సృష్టించారు. బుధవారం రాత్రి ఆసుపత్రిలో డాక్టర్ ఎ.కె. గిరీశ్, హెడ్ నర్సు, నర్సులు విధుల్లో ఉన్నారు. రాత్రి సుమారు 12.45గంటల సమయంలో కార్తీకేయ అనే వ్యక్తి విషం తాగడంతో అతని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్చారు. వైద్యం చేస్తుండగా నలుగురు వ్యక్తులు వచ్చి, కార్తీకేయను వేరే ఆసుపత్రికి తరలిస్తామని వైద్యుడు గిరీశ్‌తో వాదులాటకు దిగారు. బాధితుడికి చికిత్స జరుగుతుందని, గొడవలొద్దని వారించిన వారు వినలేదు. సంతకాలు చేసి కార్తీకేయను తీసుకువెళ్లమని వైద్యుడు గిరీశ్ వారిని కోరాడు. దీంతో కోపోద్రిక్తులైన నలుగురు వైద్యుడు గిరీశ్, హెడ్ నర్సు, సిబ్బందిపై దాడి చేసి గాయపరిచారు. డాక్టర్ గిరీశ్ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ రామయ్య తెలిపారు.

దుమ్ములేని రహదారుల నిర్మాణమే లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : దుమ్ములేని రహదారుల నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం స్థానిక ప్రజావేదికలో జాతీయ రహదారుల శాఖ, ఆర్‌వోబీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్‌వోబి, అనుబంధ రహదారుల నిర్మాణ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని రహదారుల అభివృద్ధి పనులు ఆలస్యం పట్ల ఎమ్మెల్యే ఆసహనం వ్యక్తం చేశారు. రహదారుల నిర్మాణానికి సాంకేతిక సమస్యలున్నాయని అధికారులు పేర్కొనడంతో వెంటనే జాతీయ రహదారుల మోర్తు రీజనల్ ఆర్‌వో రాకేష్‌కుమార్, మచిలీపట్నం ఎంపీ బాలశౌరితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జికి అనుబంధ రహదారులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. ఆర్‌వోబి నుంచి బస్టాండ్, పాత బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో అనుబంధ రహదారుల అభివృద్ధికి కాంట్రాక్టు సంస్థలు పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి ఆర్థికపరమైన అనుమతులు వచ్చాయన్నారు. ఇతర ప్రాజెక్టులతో ముడిపడి ఉండటంతో ఆలస్యమవుతుందన్నారు. ఎంపీ బాలశౌరి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎన్.హెచ్ డీఈ సత్యనారాయణ, ఏఈ శరత్, మున్సిపల్ ఇంజనీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఏఈలు శ్రావణ్‌కుమార్, రాజేష్, కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధులు దివాకర్, నిరంజన్, వల్లభనేని కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, స్థానిక టీడీపీ నాయకులు లింగం ప్రసాద్, పండ్రాజు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌వోబి, రహదారుల శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

నదీపాయలో తవ్వకాలు చేపట్టొద్దు

తోట్లవల్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదీపాయలో ఇసుక తవ్వకాలు చేపడితే తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం. కుసుమకుమారి హెచ్చరించారు. వల్లూరుపాలెం పాయలో బుధవారం రాత్రి జరుగుతున్న ఇసుక తవ్వకాలను మండల జనసేన పార్టీ నాయకుడు గంగిశెట్టి సత్యనారాయణ అడ్డుకున్నారు. జిల్లా కలెక్టర్‌కు, ఇతర ఉన్నతాధికారులకు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించానని ఆయన తెలిపారు. దీంతో తహసీల్దార్ గురువారం వల్లూరుపాలెం నదీపాయలోని లారీలు తిరిగే రహదారిపై గాడిని తవ్వించారు. అక్టోబర్ 15వ తేదీ వరకు నదీపాయల్లో ఎవరూ ఇసుక తీయటానికి వీల్లేదని, ఇసుక అవసరమైన వారు స్టాక్‌యార్డుల్లో తీసుకు వెళ్లాలని సూచించారు.



వల్లూరుపాలెం రేవులో రహదారిపై తవ్విన గాడి

ఘనంగా గంగానమ్మ వార్షికోత్సవం

నందివాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పొలుకొండ మంచినీటి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన గంగానమ్మ దేవాలయంలో గంగానమ్మ 32వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి ఉదయం నుంచి నవరసాలతో అభిషేకాలు, పాలాభిషేకాలు, పూజారి పొన్నూరు బాలకృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తుమ్మల విజయ కుమారి, పిన్నమనేని శ్రీలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఆలయం పురాతనమైనదన్నారు. ఈ ఆలయం పునఃనిర్మాణం 1993లో మహారాష్ట్ర కులకర్ణి మోహన్ కుమార్ సారథ్యంలో ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు గంగానమ్మ తల్లికి ప్రతి సంవత్సరం నవసరాలతో అభిషేకాలు, పాలాభిషేకాలు హోమాలు , నిత్య పూజలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామస్థుల సహాయ, సహకారాలతో అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ భజన సంఘం సభ్యులు , గ్రామస్థులు పాల్గొన్నారు.



గంగానమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

పామర్రు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రజల పక్షాన నిలబడుతున్న జనాకర్షణ ఏకైక నాయకుడు రాహుల్ గాంధీనేనని పీసీసీ ప్రధాన కార్యదర్శి, పామర్రు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మొవ్వా మోహనరావు అన్నారు. ఏఐసీసీ అధినేత పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ 55 జన్మదిన వేడుకలను పామర్రు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మత్తే వడ్డీకాసుల ఆధ్వర్యంలో ఆపార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన మోహనరావు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల కేక్ కట్‌చేసి పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్ జోడో న్యాయ్ యాత్ర ద్వారా అన్నివర్గాల సమస్యలు తెలుసుకుంటున్న ఘనత రాహుల్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాడిశెట్టి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి వింతా సంజీవరెడ్డి,పెనమలూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ధనేకుల మురళీ మోహన్, పామర్రు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కాగిత శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి మొవ్వా మోహనరావు



ఖరీఫ్ సాగుకు రైతుల సమాయత్తం

గుడివాడ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ నారుమడులు వేయటానికి రైతులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు పొలాల్లో నారుమడులు పోశారు. నారుమడులు మొక్క దశలో, అంగుళం ఎత్తులో ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో రైతులు పొలాల్లో బిజీగా కనిపిస్తున్నారు. దుక్కులు దున్నుతున్నారు. కొంతమంది నారుమడులు పోయకుండా పొలాలను మెట్టదుక్కులు దున్ని వెదజల్లుతున్నారు.

కూచిపూడి : మొవ్వలో ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఇప్పటికే కూచిపూడి, మొవ్వ, బార్లపూడి, కారకంపాడు, పెదపూడి, పెడసనగల్లు, భట్లపెనుమర్రు తదితర గ్రామాల్లో రైతులు బోర్ల కింద నారుమడులు పోశారు. మరి కొన్ని ప్రాంతాల్లో బోర్ల సౌకర్యం లేని రైతులు ఆయిల్ ఇంజన్ల సహాయంతో నారుమడుల పెంపకం చేపట్టారు. దుక్కులు దున్ని గట్లు సరి చేసుకుని ఖరీఫ్‌కు సన్నద్ధమయ్యే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. సబ్సిడీపై వరి విత్తనాలు అందించటంతోపాటు సాగునీరు సకాలంలో విడుదలకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. మొవ్వలో 11,250 హెక్టార్లలో ఖరీఫ్ సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.



పొలంలో నారుమడులు సిద్దం చేసిన రైతులు

కార్యకర్తలే టీడీపీకి ఆయువుపట్టు

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి కార్యకర్తలే ఆయువు పట్టని , వారి సంక్షేమానికి కార్యకర్తల సంక్షేమ నిధిని ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రజావేదికలో ఇటీవల ప్రమాదంలో మరణించిన నందివాడకు చెందిన కొసనం నరసింహరావుకు టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ.5లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమ నిధి సారథిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టాక పలు విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారన్నారు. కోటి మంది కార్యకర్తలకు ఒకేసారి బీమా సౌకర్యం కల్పించడం ఒక్క టీడీపీకే సాధ్యమన్నారు. అనంతరం మృతుడు నరసింహారావు భార్య ప్రభావతిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అఖిల్ శేష్‌కుమార్, అరిపిరాల గ్రామ అధ్యక్షుడు చింత కమలయ్య, నాయకులు అందుగుల ఏసుపాదం, మద్దాల రాజేష్, సాల్మన్‌రాజు, జనసేన నాయకులు గుల్లపల్లి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



నరసింహారావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

పామర్రు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పామర్రులోని నాగులేరుగట్టు ప్రాంతంలో నివాసముండే ఓడుగు సాయి పూజిత(15) అనే బాలిక స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. ప్రతిరోజూ మాదిరిగానే పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తరువాత స్నానం చేసింది. బుధవారం సాయంత్రం ట్యూషన్‌కు అనిచెప్పి ఇంట్లోనుంచి బయటకువెళ్లింది. అలా వెళ్లిన ఆ బాలిక రాత్రి పొద్దుపోయేవరకు రాకపోవడంతో ట్యూషన్‌తోపాటు వారి బంధువులను కుటుంబసభ్యులు వాకబు చేశారు. కుమార్తె అచూకీ తెలియకపోవడంతో బాలిక తల్లి నాగమణి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై రాజేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు చెప్పారు.

బుడమేరు ముంపు నివారణకు చర్యలు చేపడతాం

● తహసీల్దార్ శ్రీను నాయక్

పెదపారుపూడి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బుడమేరు వరద ముంపు నివారణకు చర్యలు చేపడతామని తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. పెదపారుపూడిలో వరద ముంపునకు గురైన గ్రామాల ప్రజలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వరదలకు మోపర్రు, వింజరంపాడు, నాగాపురం గ్రామాలు బుడమేరు వరద ముంపునకు గురయ్యాయన్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని పొలాలు నీట మునిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని వివరించారు. ఆయా గ్రామాలలోని పొలాల్లోకి వరదనీరు రాకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, ఇరిగేషన్, డ్రెయినేజీ, ఫిషరీష్, పంచాయతీరాజ్ ఎంపీటీసీ, సర్పంచ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీను నాయక్

విద్యుత్ స్తంభాలు స్వాధీనం

తోట్లవల్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : దేవరపల్లిలో శ్రీనివాసరెడ్డి పశువుల పాకకు వినియోగించిన కరెంటు స్తంభాలను గురువారం స్వాధీనం చేసుకున్నామని మండల విద్యుత్‌శాఖ ఏఈ దేవదాసు తెలిపారు. పొలాల్లో విరిగి నిరుపయోగంగా ఉన్న స్తంభాలను శ్రీనివాసరెడ్డి పశువుల పాకకు వినియోగించాడన్నారు. రెండు విద్యుత్ స్తంభాలను తొలగించి స్వాధీనం చేసుకున్నామని ఏఈ తెలిపారు.

అకారణంగా పూజారిపై దాడి

గుడివాడ : స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఆ గుడి పూజారి సోమేశ్వరరావుపై ఓ వ్యక్తి అకారణంగా దాడి చేసి గాయపరిచాడు. గణపతి భరత్‌కుమార్ అనేవ్యక్తి పెద్ద శివాలయం వద్ద పూజారి సోమేశ్వరరావును ఒక అడ్రస్సు అడిగాడు, చెప్పేలోపే భరత్‌కుమార్ పూజారిని కొట్టి, అతని వద్ద ఉన్న శఠగోపం, ఇతర సామగ్రిని కిందపడేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

గుడివాడ : స్థానిక శ్రీరామపురానికి చెందిన గుళ్లపూడి చిట్టి శివ నాగప్రసాద్(40) గుడివాడ డిపో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం స్థానిక రైలుపేటలోని తన స్నేహితురాలు సుశీల ఇంటికి వెళ్లి సాయంత్రం ఉరివేసుకుని మృతి చెందాడు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య అంబిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేపి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ ఎస్సై వి.జాస్మిన్ తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

● పామర్రు ఎంపీడీవో కె.జ్యోతి

పామర్రు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే యోగాతో సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవచ్చునని పామర్రు ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. ఈ నెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిమ్మకూరు జడ్పీ పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన యోగా శిక్షణ తరగతుల్లో ఆమె ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరక, మానసికోల్లాసానికి ప్రతినిత్యం యోగా సాధన అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచించారు. యోగా గురువు ముదిగొండశాస్త్రి విద్యార్థులకు సూర్య నమస్కారాలతోపాటు ప్రాణాయామం, పద్మాసనం, మకర హనుమంతు భుజాంగ చక్రం పర్వత వృక్ష అసనాలతోపాటు మరిన్ని అసనాలపై శిక్షణ ఇచ్చారు. మండల ప్రత్యేక అధికారి ఎం. ఫణి దూర్జేటి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పడమట శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి జి. పద్మావాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. లక్ష్మిలత, మండల బీజేపీ అధ్యక్షుడు ఎం. శివకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



పామర్రులో యోగాసనాలు వేస్తున్న ఎంపీడీవో కె.జ్యోతి

పామర్రు : అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతానికి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, రాజకీయనేతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కోరారు. విశాఖ యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణలో ఉన్నా ఆయన గురువారం స్థానిక అధికారులతో పాటు పార్టీనేతలతో టెలీకాన్ఫరెన్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా యోగాంధ్ర విజయవంతానికి కూటమినేతలు, అధికారులకు మార్గదర్శకాలు వివరించారు.

కూచిపూడి: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా విజయవంతానికి గ్రామాల్లో సైతం ప్రజలు సన్నద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా కూచిపూడిలో ఎంపిక చేసిన 8 ప్రదేశాల్లో గ్రామపంచాయతీ అధికారుల పర్యవేక్షణలో శిక్షణ కొనసాగుతుంది. మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో 144 ప్రదేశాల్లో 21,109 మంది లక్ష్యానికి గానూ 23,400 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఏవో శ్రీనివాస్ తెలిపారు.

సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన తప్పనిసరి



పమిడిముక్కలలో..

● పీహెచ్‌సీ వైద్యాధికారిణి అఖిల

పమిడిముక్కల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అధికారిణి అఖిల పేర్కొన్నారు. వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా వ్యాధి వారసత్వం వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమని, రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్ఠంగా ఉంటాయన్నారు. అనంతరం ఈ వ్యాధి లక్షణాలను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు.

పెదపారుపూడి : ప్రపంచ సికిల్‌సెల్ వ్యాధి దినోత్సవం పురస్కరించుకుని గురువారం పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయంలో సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ విద్యుల్లత వ్యాధి లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎంపీడీవో విమాదేవి మాట్లాడుతూ ఈ వ్యాధి గిరిజన ప్రాంతాల్లో జెనటిక్‌గా వచ్చే వ్యాధి అని, ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహనతో ముందుకు వెళ్లాలని అన్నారు. అనంతరం ఎంపీడీవో ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో వంగా శ్రీనివాస్, ఎంపిహెచ్‌వో చంద్రశేఖర్, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



పెదపారుపూడిలో..


తోట్లవల్లూరు : ఎర్ర రక్తకణాలు మార్పుచెందటం ద్వారా సికిల్‌సెల్ వ్యాధి వస్తుందని, ఇది ఎక్కువగా ఎస్టీ ఏరియాల్లో సంక్రమించే ప్రమాదముందని, అందుచేత పారిశుధ్య చర్యలు తీసుకోవటం ఎంతో అవసరమని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ టి.సాయిప్రసన్న తెలిపారు. తోట్లవల్లూరు ప్రాథమిక పాఠశాల నుంచి గురువారం ప్రపంచ సికిల్‌సెల్ అనీమియా డే సందర్భంగా ర్యాలీ నిర్వహించి అవగాహన సదస్సు నిర్వహించారు. సికిల్ సెల్ అనీమియాపై ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి మందులు కూడా అందిస్తామన్నారు సీహెచ్‌వో పద్మావతి, హెచ్ఎస్ అనిల్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ దివ్యలత, వైద్య సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో..

23న నందీశ్వరుడికి పంచామృతాభిషేకాలు

నాగాయలంక, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కృష్ణానదీ తీరాన ఉన్న గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 23వ తేదీ సాయంత్రం నందీశ్వరుడికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు శ్రీరామ పాదక్షేత్రం ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తెలిపారు.



రీ సర్వేతో రైతులకు మేలు

● కలెక్టర్ డీకే బాలాజీ

మోపిదేవి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రీ సర్వే వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. గురువారం వెంకటాపురం, అన్నవరం గ్రామాల్లో రీ సర్వే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. వెంకటాపురం సచివాలయంలో ఆన్‌లైన్ ద్వారా రీ సర్వే విధానాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు.



వెంకటాపురంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

కాలువల పూడికతీత చేపట్టండి

మండలంలోని అతి పెద్దదైన మంగళవానిశింకు డ్రెయిన్ పూడుకుపోయి వర్షాకాలంలో పంటలు ముంపునకు గురై రైతులు నష్టాలపాలవుతున్నారని, ఈ ఏడాదైనా పూడికతీత చేపట్టాలని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మోపిదేవి నుంచి రావివారిపాలెం, బోడగుంట, వెంకటాపురం వరకు ఉన్న 11/1 బ్రాంచ్ సాగునీటి కాలువ పూడికతీయాలని రైతులు కోరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యేలోగా సాగునీటి కాలువలు, డ్రైనేజీలు పూడికతీత చేపడతామని తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రావివారిపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి కలెక్టర్ బాలాజీ సూచించారు. పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో రోగులతో మాట్లాడారు.

అంగన్వాడీ తనిఖీ

వెంకటాపురంలో అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తింటున్న చిన్నారులతో కలిసి ఆయన ఆహారం రుచి చూశారు. వంటగదిలో ఆహార పదార్థాలను పరిశీలించారు.

నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు సాగాలి


మోపిదేవిలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో రూ.33.40 లక్షలతో హాస్టల్‌లో మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణ పనులను కలెక్టర్ బాలాజీ పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. హాస్టల్‌లోని బాలికలతో ముఖాముఖి నిర్వహించి వసతులపై ఆరా తీశారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ సభ్యుడు ఎం.మల్లికార్జునరావు ఎంపీపీ రావి దుర్గావాణి, తహసీల్దార్ శ్రీవిద్య, ఎంపీడీవో స్వర్ణభారతి, ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి, సీడీపీవో తులసీకుమారి, డీడీ సాహేద్ బాబు, వైద్యాధికారులు అనిల్‌కుమార్, లక్ష్మీనాథ్ ఉన్నారు.

సుబ్బారాయుడి సేవలో ఎస్పీ గంగాధరరావు

మోపిదేవి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని గురువారం దర్శించుకున్నారు. నాగపుట్టలో పాలుపోసి స్వామికి పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి, శేషవస్త్రాలతో సత్కరించింది. స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఉద్యోగులు అందజేశారు.



ఎస్పీకి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగి





జాయింట్ పట్టాదారుల భూముల విభజనకు రంగం సిద్ధం

మచిలీపట్నం టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో వెబ్ లాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానుల భూములను విభజన చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని సర్వేశాఖ ఏడీ జోషీల తెలిపారు. కలెక్టరేట్ సమావేశపు హాలులో జిల్లాస్థాయిలో సర్వేయర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏడీ మాట్లాడారు. భూములను విభజన చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన రూ.500 ఫీజు పూర్తిగా మినహాయింపు ఇచ్చారని, ఉచితంగా సేవలు పొందొచ్చని తెలిపారు. దీనికి నామమాత్రపు రుసుం గ్రామ సచివాలయాల్లో రూ.50 చెల్లించి ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జోషీల

మంత్రి రవీంద్ర పుట్టినరోజు సందర్భంగా

నేడు సేవా కార్యక్రమాలు

మచిలీపట్నం టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మంత్రి కొల్లు రవీంద్ర పుట్టిన రోజు సందర్భంగా పార్టీ నాయకులు శుక్రవారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం ఉదయం 8గంటలకు పార్టీ కార్యాలయం వద్ద కేక్ కటింగ్ చేసి, అల్పాహారం అందజేస్తారన్నారు. అనంతరం సుల్తానగరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అర్చనలు, 34వ డివిజన్‌లో షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ, 9గంటలకు కరగ్రహారం బాబా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు, వాసవీ వృద్ధాశ్రమంలో వస్త్రదానం, కార్మికులకు కరెడ్ల సుశీల దుస్తుల పంపిణీ, శిడింబి అగ్రహారంలో పీవీ ఫణికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చనలు, తాళ్లపాలెంలో కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఐ క్యాంపు, చిన్నాపురం బీసీ హాస్టల్‌లో దుప్పట్ల పంపిణీ, 49వ డివిజన్ ఎస్టీ కాలనీలో పండ్ల పంపిణీ, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు తెలుగు మహిళలు రొట్టెలు, పాల పంపిణీ, ఈడేపల్లి వృద్ధాశ్రమంలో అన్నదానం, అమృతపురంలో కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ, 22వ డివిజన్ ఎస్టీ కాలనీ లో గొడుగుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మస్తర్లు లేకుండానే బిల్లుల చెల్లింపు

● సామాజిక తనిఖీలో గుర్తించిన అధికారులు

మోపిదేవి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పలు అవకతవకలను సామాజిక తనిఖీ బృందం గుర్తించిందని సామాజిక తనిఖీ డీఆర్పీ బాలకృష్ణ వెల్లడించారు. గురువారం కొక్కిలిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సామాజిక తనిఖీ గ్రామసభలో ఆయన మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి పంచాయతీ పరిధిలో రూ.34,54,709 విలువైన 43 పనులు శ్రామికులు చేశారని ఆయన వెల్లడించారు. కాలువ గట్ల వెంబడి మొక్కలు, రహదారుల వెంబడి మొక్కలు నాటినట్లు బిల్లులు చేశారని, ప్రస్తుతం ఆ ప్రదేశాల్లో మొక్కలు లేవని తనిఖీలో గుర్తించామన్నారు. గ్రామంలో పలు పనులకు సంబంధించి శ్రామికుల సంతకాలు, మస్తర్లు లేకుండానే వేతనాలు చెల్లించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణి, కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, ఏపీవో ముత్యాలు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులతో సమావేశమైన హెచ్ఎం కైతేపల్లి దాస్

ఆటో ఏర్పాటు చేస్తాం.. పిల్లలను బడికి పంపండి

● ఎస్టీ కుటుంబాలతో నారాయణరావునగర్ మోడల్ పాఠశాల హెచ్ఎం దాస్


చల్లపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రోజూ పాఠశాలకు వెళ్లేందుకు, వచ్చేందుకు ఉపాధ్యాయులమే ఆటో ఏర్పాటుచేస్తామని పిల్లలను బడికి పంపాలని నారాయణరావునగర్ మోడల్ పాఠశాల హెచ్ఎం కైతేపల్లి దాస్ తల్లిదండ్రులను కోరారు. స్థానిక కరెంటు ఆఫీసు పక్కనే గుడారాల్లో నివసించే ఎస్టీ కుటుంబాలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. పిల్లలను బడికి పంపాలని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ప్రభుత్వ పాఠశాలలోనే సమకూరతాయని, పిల్లలు క్షేమంగా వెళ్లివచ్చేందుకు ఆటోను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కొందరు పిల్లలకు ఆధార్ కార్డులు లేవనిచెప్పగా ఆధార్ కార్డులు, ప్రభుత్వ పథకాలు అందేలా కృషిచేస్తామన్నారు.

వాణి బ్యాకరీ దగ్ధం

మచిలీపట్నం టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్ కారణంగా చలరాస్తా సెంటర్‌లోని వాణి బ్యాకరీ దగ్ధమైంది. గురువారం ఈ సంఘటన జరిగింది. ఎలక్ట్రికల్ పరికరాలు పాతవి కావడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగిందని తెలుస్తోంది. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

ప్రకృతి విపత్తులపై అప్రమత్తత అవసరం

నాగాయలంక/ఘంటసాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల పట్ల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగాయలంక తహసీల్దార్ ఎం.హరనాథ్, ఘంటసాల తహసీల్దార్ బి.విజయప్రసాద్ సూచించారు. విపత్తుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం నాగాయలంక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, మండల స్థాయి అధికారులతో హరనాథ్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గ్రామ స్థాయి అధికారులతో కలిసి శ్రీకాకుళం పంచాయతీ కార్యాలయం వద్ద విజయప్రసాద్ గ్రామసభను నిర్వహించారు.





టీడీపీ గ్రామ కమిటీల ఎన్నిక

అవనిగడ్డ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. పార్టీ అవనిగడ్డ అధ్యక్షుడిగా అన్నపరెడ్డి వెంకట లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా లుక్కా శ్రీనివాసరావు, రామకోటిపురం అధ్యక్షుడిగా రేపల్లె అంకినీడుప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బొప్పన వెంకట శివనాగప్రసాద్, అశ్వారావుపాలెం అధ్యక్షుడిగా దాసినేనేని శ్రీనివాసవారావు, ప్రధాన కార్యదర్శిగా కొండవీటి మధుసూదనరావు ఎన్నికయ్యారు. మోదుమూడి అధ్యక్షుడిగా బచ్చు మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శిగా మెరుగు స్వామిరెడ్డి, పులిగడ్డ అధ్యక్షుడిగా గుంటూరు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చెన్ను రాంబాబు, వేకనూరు అధ్యక్షుడిగా మాదివాడ రత్నారావు, ప్రధాన కార్యదర్శిగా దోవారి ఏడుకొండలు, దక్షిణ చిరువోలులంక అధ్యక్షుడిగా కొక్కిలిగడ్డ లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా బచ్చు మురళి, పాత ఎడ్లంక అధ్యక్షుడిగా నాగినేని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పీతా నాగభూషణం ఎన్నికయ్యారు. నూతన కమిటీలను టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, మాచవరపు ఆదినారాయణ, బండే రాఘవ, బచ్చు రఘునాథ్, విశ్వనాథుని మురళీ, లుక్కా పిచ్చియ్య, యాసం లంకమ్మ అభినందించారు.

ఆటోలో మర్చిపోయిన ఫోన్ గంటలో రికవరీ

మచిలీపట్నం టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి లిఖిత గురువారం ఆటోలో కలెక్టరేట్‌కు వచ్చి తన ఫోన్‌ను అందులో మర్చిపోయింది. చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. సీఐ నబీ టెక్కాల జీని సాయంతో గంటలో ఆ ఫోన్‌ను రికవరీ చేసి లిఖితకు అందజేశారు.



స్కూళ్ల మార్పుపై తల్లిదండ్రుల ఆగ్రహం

పిల్లల్ని అంతదూరం ఎలా పంపుతామంటూ ఆవేదన ● టీడీపీ నేతలతో కలిసి చిల్లకల్లు ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా

జగ్గయ్యపేట రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలను డీగ్రేడ్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా టీడీపీ నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వివరాల్లోకి వెళితే చిల్లకల్లు మండలంలోని ధర్మవరప్పాడు తండ, రావిరాల, వేదాద్రి, కె.అగ్రహారం, అన్నవరం, తక్కెళ్లపాడు గ్రామాల పాఠశాలల్లో ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను రద్దు చేసి 226 మంది విద్యార్థులను 4 నుంచి 7 కి.మీ. దూరంలోని జయంతిపురం, బలుసుపాడు, షేర్‌మహ్మద్‌పేట, ముక్త్యాల, అనుమంచిపల్లి జడ్పీ పాఠశాలలకు కేటాయించాలన్న అధికారుల నిర్ణయానికి వ్యతిరేకంగా తల్లిదండ్రులు అధికారంలో ఉన్న టీడీపీ నేతలతో కలిసి గురువారం చిల్లకల్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పాఠశాలల ప్రారంభ రోజు నుంచి గ్రామాల్లో మొదలైన నిరసనలు మండల కార్యాలయం వరకు చేరాయి. నిరుపేద, వ్యవసాయ, కూలీ కుటుంబాల తల్లిదండ్రులు దూర పాఠశాలలకు పిల్లలను పంపడం అసాధ్యమని, విలీనం వల్ల విద్యార్థులు చదువు మానే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తరగతుల రద్దుతో పాఠశాలలు మూతపడితే విద్యార్థులు బాల కార్మికులుగా, బాలికలు బాల్య వివాహాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వెలిబుచ్చారు.





మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న తల్లిదండ్రులు, జీవోను వివరిస్తున్న ఎంఈవో

ప్రభుత్వ నిబంధనలను ఎంఈవో వక్రీకరిస్తూ, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలతో లాలూచీలో పడి గ్రామీణ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. జాతీయ రహదారులు, కాల్వలు, నదుల వంటి అడ్డంకులున్న ప్రాంతాల్లో దూర పాఠశాలలకు పిల్లలను పంపడం ఇబ్బందికరమని, ఎమ్మెల్యే, సర్పంచ్‌లు, విద్యా కమిటీలు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించకుండా ఎంఈవో సొంత నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. ధర్నాలో టీడీపీ నాయకులు కట్టా నరసింహారావు, గింజుపల్లి రమేష్, వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. 'ఈ ఎంఈవో మాకొద్దు, ఇక్కడి నుంచి పంపించండి' అంటూ నినాదాలు చేసి, ఎంపీడీవో నితిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పాఠశాలలను డీ గ్రేడ్ చేశామని, ఉన్నతాధికారుల నిర్ణయాన్ని అమలు చేశామని, ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని వివరించారు. దీనికి సంబంధించిన పత్రాలను వారికి చూపించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ, టీడీపీ నాయకులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ధర్నా చేయడం గమనార్హం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, విలీన నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తామన్నారు. సానుకూల స్పందన లేనట్లైతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిర్ణయం గ్రామీణ విద్యార్థుల విద్యా హక్కును దెబ్బతీస్తుందని, ప్రభుత్వం స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రవాణా సౌకర్యం లేదు..
కస్తూర్తి శ్రీనివాసరావు, సర్పంచ్, తక్కెళ్లపాడు



గ్రామానికి రవాణా సౌకర్యం లేదు. విద్యార్థులను సమీపంలోని షేర్‌మహ్మద్‌పేటకు పంపటం ఇబ్బందిగా ఉంది. 5 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిపై ప్రయాణించాలి. పిల్లలను ఎలా పంపుతాం. ఎంఈవో ఏకపక్ష నిర్ణయంతోనే ఇబ్బంది.

వ్యయప్రయాసే.. వసూరాం, విద్యార్థి తండ్రి



వ్యవసాయ కూలీ పనులు చేసుకునే తాము తమ పిల్లలను ఇతర గ్రామాలకు పంపాలంటే ఆర్థికంగా ఇబ్బంది. రవాణా సౌకర్యం సరిగా లేని గ్రామాలకు పిల్లలు పంపటం వ్యయప్రయాసే.

55 మందికి టీసీలిచ్చారు
గుండ్ల కృష్ణారావు, కే అగ్రహారం

తమ గ్రామంలోని 55 మందికి టీసీలిచ్చారు. వారిని 7 కిలోమీటర్ల దూరంలోని ముక్త్యాల కానీ జగ్గయ్యపేటకు కానీ పంపమని చెబుతున్నారు. ఎంఈవో ఏకపక్ష నిర్ణయంతో గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది.





ఎన్టీటీపీఎస్

కాటా డ్యూటీ అవినీతిపై
అధికారుల విచారణ

● అదనపు సిబ్బందిని తగ్గించేందుకు చర్యలు

ఇబ్రహీంపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో యాష్ కాటా డ్యూటీ విషయంలో జరిగిన అవినీతి వ్యవహారాన్ని వెలికి తీసేందుకు ఎన్టీటీపీఎస్ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించినట్టు తెలిసింది. [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్] ఈనెల 18న ఆంధ్రజ్యోతిలో కాసుల కురిపిస్తున్న కాటా డ్యూటీ అనే శీర్షికతో ప్రచురితమైన కథనంలో ప్లాంట్‌లో యాష్ కాటా డ్యూటీల నియామకంలో జరిగిన అవినీతిని, అధికారులు, ఉద్యోగుల చేతివాటంపై సమగ్ర కథనం రావడంతో అధికారుల్లో చలనం కలిగింది. ఈ క్రమంలో అసలు యాష్ కాటా వద్ద ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారు. అదనంగా ఎంత మందిని అక్రమంగా అడ్డదారుల్లో నియమించారో విచారణ చేపట్టారు. కొన్నేళ్లుగా యాష్ కాటా డ్యూటీని మొత్తం 15 మంది నిర్వహిస్తున్నారు. అయితే అక్రమార్జన కోసం అదనంగా మరికొందర్ని అవసరం లేకున్నా అడ్డగోలుగా నియమించినట్టు గుర్తించారు. కాటా డ్యూటీలో అక్రమంగా నియమించిన స్థానాలు ఇప్పటికీ ఖాళీగా ఉండటంతో ఎంతో వృత్తి నైపుణ్యం ఉన్నవారినే తిరిగి యథాస్థానాలకు బదిలీ చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. మొత్తం మీద కాసులు కురిపిస్తున్న కథనం ఎన్టీటీపీఎస్‌లో గుట్టు చప్పుడు కాకుండా కాసులకు కక్కుర్తిపడి చేస్తున్న అంతర్గత బదిలీల వ్యవహారం వెలుగులోకి రావడంతో ఎన్టీటీపీఎస్ అధికారులు దిద్దుబాటు చర్యల్లో నిమగ్నమయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

రెవెన్యూ సేవలు ప్రజలకు
మరింత చేరువ చేయాలి

● ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు

విజయవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డేను ప్రతి జిల్లా, మండల హెడ్‌క్వార్టర్‌లో నిర్వహించి రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువచేసేలా అవగాహన కల్పించాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ 150 ఏళ్ల కిందటే భూపరిపాలన వ్యవస్థ ద్వారా రెవెన్యూ వ్యవస్థ మూలాలు ఏర్పడ్డాయన్నారు. శుక్రవారం నిర్వహించబోయే రెవెన్యూ దినోత్సవంలో ప్రతి రెవెన్యూ ఉద్యోగి, అధికారి పాల్గొని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రెవెన్యూశాఖ ఉద్యోగులు ప్రజాభిముఖ పాలనతో పాటు ప్రజాసమస్యలపై సత్వరమే స్పందించి పనిచేయాలన్నారు. ప్రజలకు విశ్వాసం కలిగించేందుకు ప్రతి కార్యాచరణలో పారదర్శకతను పాటించి, పూర్తి బాధ్యతతో సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించే ప్రయత్నం చేయాలని వెంకటేశ్వర్లు సూచించారు. ప్రజాస్వామ్యవాద పరిపాలనలో ప్రతిస్పందన, నైతికతను కొనసాగిస్తూ రెవెన్యూశాఖ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేయడానికి అంకిత భావంతో ముందుకు సాగాలన్నారు. రెవెన్యూ ఉద్యోగ సంఘ నేతలు పాల్గొన్నారు.

పాత భవనంలో పడక కష్టాలు

పాత జీజీహెచ్‌లో కొత్తభవనం పూర్తి చేయాలంటూ విన్నపాలు

● మరో రెండంతస్తులు పెంచితే మరింత సౌలభ్యం ● రక్త పరీక్షలు, స్కానింగ్‌కు వేరే భవనానికి వెళ్లాల్సిన పరిస్థితి

విజయవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాత ప్రభుత్వ జనరల్ గవర్నమెంట్ హాస్పిటల్ (జీజీహెచ్)లో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం తుది దశకు చేరుకుంది. ఈ భవనం పూర్తయితే గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సత్వరమైన, సమగ్ర వైద్య సేవలు ఒకేచోట అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం, బెడ్ల కొరతతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో బెడ్‌ను ఇద్దరు బాలింతలకు కేటాయిస్తుండటంతో, కుట్లు, నడుము నొప్పులతో బాధపడేవారు మరింత అసౌకర్యానికి గురవుతున్నారు. స్కానింగ్, రక్త పరీక్షల కోసం గర్భిణులు దూరంగా ఉన్న మరో భవనానికి నడవాల్సి రావడం వారికి కష్టతరంగా మారుతోంది.

నిర్మాణంలో సవాళ్లు, పురోగతి

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగినప్పటికీ, బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశారు. దాదాపు మూడేళ్లపాటు పనులు స్తబ్ధంగా ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, కేంద్ర నిధులతో నిర్మాణం పునఃప్రారంభమైంది. అయినప్పటికీ, నిధుల కొరతతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నిధుల విడుదల కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చినట్టు ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.



నిర్మాణదశలో ఉన్న నూతన భవనం

ఇదీ జీజీహెచ్ చరిత్ర

1958లో ఒక తాలూకా ఆసుపత్రిగా స్థాపితమైన జీజీహెచ్, 1986లో ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌తో అనుసంధానమై 412 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయింది. 1996లో జిల్లా ఆసుపత్రిగా మారింది. 2017లో నగరంలో మరో జీజీహెచ్ నిర్మితమైనప్పటికీ, పాత జీజీహెచ్ ప్రసూతి, శిశు వైద్యం, మానసిక రోగులకు మాత్రమే సేవలందిస్తోంది. ప్రస్తుతం 400 పడకలలో గైనకాలజీ విభాగంలో 200 పడకలు మాత్రమే ఉన్నాయి. పేద, మధ్యతరగతి గర్భిణులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో పడకల కొరత తీవ్ర సమస్యగా మారింది.

నూతన భవనం పూర్తయినట్టయితే పడకల కొరత తీరడమే కాక, అన్ని వైద్య సేవలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయి. మరో రెండంతస్తుల నిర్మాణంతో మరిన్ని సేవలు అందించవచ్చని ఆసుపత్రి వర్గాలు భావిస్తున్నాయి. ఈ భవనం త్వరగా పూర్తయి అందుబాటులోకి వస్తే, గర్భిణులు, బాలింతలకు సౌకర్యవంతమైన, సమర్థవంతమైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది.

అమరావతిలో ప్రపంచ, ఆసియా బ్యాంకు బృందం పర్యటన

కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం గురువారం అమరావతిలో పర్యటించారు. తొలుత బృందం సభ్యులు విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలోని రాజధాని అమరావతి నిర్మాణంలో అమలు చేయాల్సిన పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలు, కార్మికుల ఆరోగ్య భద్రత వంటి అంశాలపై ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం జరిగింది. ఈ బృంద సభ్యులకు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సాయిసూర్య ప్రవీణ్‌చంద్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి నిర్మాణ కార్యకలాపాల్లో పర్యావరణ పరిరక్షణ, కార్మికుల భద్రత, కార్మికులకు పని ప్రదేశంలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను వివరించారు. అలాగే అమరావతిలో నివసిస్తున్న ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన గురించి తెలిపారు. లింగవివక్ష, బాలకార్మికులకు తావులేకుండా నిర్మాణ పనులు చేపట్టినట్టు చెప్పారు. గ్రీవెన్స్ రిడ్రస్సల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా రైతులు, రాజధాని ప్రాంతవాసుల సమస్యలను ఎప్పటికప్పుడు అర్జీల రూపంలో స్వీకరించి, సత్వరమే పరిష్కరిస్తున్నామన్నారు. బృందంలోని సీనియర్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు బాయన వెంకటరావు మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్టులో భాగంగా ఉన్న పర్యావరణ, సామాజిక వ్యవస్థల అసెస్‌మెంట్ ప్రక్రియపై సూచనలను వివరించారు. రీసెటిల్మెంట్ యాక్షన్ ప్లాన్, పాలసీల గురించి వివరించారు. అనంతరం బృందంలోని సామాజిక రక్షణ కార్యకలాపాల సలహాదారు రంజన్ వర్మ, బాయన వెంకటరావు, అమరావతి నిర్మాణ ప్రాజెక్టులో ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల బాధ్యతలను, పర్యావరణ, సామాజిక సంక్షేమ కార్యకలాపాల ప్రాముఖ్యతను వివరించారు. సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ స్పెషలిస్టు జోసెఫ్, పర్యావరణ సంరక్షణ కార్యకలాపాల సలహాదారుల దమన్‌జిత్ సింగ్ మిన్హాస్ మాట్లాడుతూ రాజధాని నిర్మాణంలో పాలుపంచుకొంటున్న గుత్తేదారులు పాటించాల్సిన సామాజిక రక్షణ కార్యకలాపాలు పర్యావరణ పరిరక్షణ, ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు పాటించాల్సిన సురక్షిత విధానం, కార్మికుల భద్రత తదితర అంశాల గురించి వివరించారు. మహిళా ప్రతినిధి జయశర్మ మాట్లాడుతూ లైంగికదాడి, హింస తదితర ఘటనలు జరిగినప్పుడు పాటించాల్సిన గోప్యత, బాధితులకు అందించాల్సిన సహాయం వంటి అంశాలను వివరించారు. అనంతరం నిర్మాణ పనులు జరుగుతున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాస సముదాయాలు, శాఖమూరు రిజర్వాయర్, ఎల్పీఎస్ జోన్ 2ఏ ప్రాజెక్ట్ సైట్, కార్మికుల క్యాంపులను బృంద సభ్యులు, సీఆర్‌డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు, సిబ్బంది పరిశీలించారు. అనంతరం బృంద సభ్యులు ఆయా సైట్లలో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడారు. గుత్తేదారు సంస్థలు క్యాంపుల్లో అందుబాటులో ఉంచిన మౌలిక సదుపాయాలను గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. సీఆర్‌డీఏ, ఏడీసీఎల్‌లోని చీఫ్ ఇంజినీర్లు సీహెచ్ ధనుంజయ, ఎన్ శ్రీనివాసులు, ఎం ప్రభాకరరావు, ఎస్ఈ ఆర్ హనుమంతరెడ్డి, డీఈ పీ వెంకటేశ్వర్లు, ఈఈ కే శ్రీనివాసరావు, ఇతర క్షేత్రస్థాయి అధికారులు, ఇంజినీర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాజధాని అమరావతిలో పర్యటిస్తున్న ప్రపంచ, ఆసియా అభివృద్ధి బ్యాంకుల బృంద సభ్యులు

అర్జునవీధి దుర్గగుడి స్థలంలో
ఆక్రమణల తొలగింపునకు సిద్ధం!

ఇంద్రకీలాద్రి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అర్జునవీధి నుంచి రథం సెంటర్‌కు వెళ్లే దారిలో దుర్గగుడికి చెందిన స్థలంలో ఆక్రమణలను తొలగించేందుకు రంగం సిద్ధమైంది. గురువారం పశ్చిమ తహసీల్దార్, వీఎంసీ టౌన్ ప్లానింగ్ సర్వేయర్, రెవెన్యూ వీఆర్వోలు దేవస్థానం ఈవో శీనానాయక్‌ను కలిశారు. ఈ సందర్భంగా శీనానాయక్ మాట్లాడుతూ సుధాకర్ హోటల్ యాజమాన్యం నుంచి రూ.1,821 3,902 దేవస్థానం సొమ్మును చెల్లించి కొనుగోలు చేసినట్టు వారికి చూపించారు. అయితే భక్తులకు ఇబ్బంది కలిగించేలా కొంతమంది వ్యాపారులు స్థలాన్ని ఆక్రమించారని వారి వ్యాపారాలతో రాకపోకలకు ట్రాఫిక్ ఎంతో ఇబ్బందికరంగా మారిందన్నారు. రికార్డులు పరిశీలించిన అనంతరం ఆ స్థలాన్ని దుర్గగుడి అసిస్టెంట్ కమిషనర్ రంగారావు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ స్థలానికి సరిహద్దులను రెండు రోజుల్లో నిర్ణయిస్తామని, స్థలంలోని ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఈనెల 12న ఈవో శీనానాయక్ ఆ స్థలాన్ని చూసి అన్నదాన సేవా కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. అయితే ఆ స్థలం పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురికావటంతో కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, మునిసిపల్ కమిషనర్‌కు లేఖలు రాశారు. దీంతో గురువారం తాజా పరిస్థితి ఏర్పడింది. 2 రోజుల్లో స్థలానికి సరిహద్దులు నిర్ణయించి ఆక్రమణలు తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ వ్యాపారులు స్థలాన్ని ఆక్రమించుకుని యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. భక్తుల ఇబ్బందులను ఈవో శీనానాయక్ పరిగణనలోకి తీసుకుని ఆ స్థలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి నిర్ణయం తీసుకున్నారు.



అర్జునవీధి, రథం సెంటర్ దారిలో ఆక్రమణలు పరిశీలిస్తున్న తహసీల్దార్, టౌన్ ప్లానింగ్ సర్వేయర్, వీఆర్‌వోలు, దుర్గగుడి అధికారులు



సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో కలిసి యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

మన జీవిత పుస్తకంలో
ప్రతిపేజీలో యోగా ఉండాలి

సత్యనారాయణపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మన జీవిత పుస్తకంలోని ప్రతి పేజిలోనూ యోగా ఉండాలని, ప్రతి ఒక్కరూ కామన్ యోగా ప్రొటోకాల్ యోగాను జీవన విధానంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్‌రోడ్డు యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో గురువారం థీమ్‌యోగా జరిగింది. వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, యోగా ఔత్సాహికులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య ఆనంద ఆంధ్రాకు తొలి అడుగు యోగాంధ్ర అన్నారు. శరీరంలోని అన్ని వ్యవస్థలు నూతన ఉత్తేజాన్ని ఇచ్చే శక్తి యోగాసనాలకు ఉందన్నారు. ఒత్తిడిని మన జీవితంలో అడుగు పెట్టనివ్వకుండా యోగాసనాలు రక్షణ కవచాలుగా పని చేస్తాయని చెప్పారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, వీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ డీ చంద్రశేఖర్, ఎన్‌సీసీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కే రమేష్, యుగంధర్ పాల్గొన్నారు.

హాస్యం పండించడం జంధ్యాలకే సాధ్యం

● నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి

విజయవాడ కల్చరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): హాస్యం గుర్తుండేలా పండించాలంటే అది జంధ్యాలకే సాధ్యమని, మళ్లీ ఆయన జన్మిస్తేనే బాగుంటుందని నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. ఎంసీ దాస్ జంధ్యాలతో ఉన్న సాన్నిహిత్యాన్ని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నటీనట నాట్య వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ సునిశిత హాస్యానికి మరోపేరు జంధ్యాల అని, ఆయన రచించిన నాటికలు పలుమార్లు ప్రదర్శించి అవార్డులు అందుకున్నానని, వారు చిరస్మరణీయులన్నారు. జంధ్యాల 24వ వర్ధంతిని పురస్కరించుకొని కళామంజరి సంస్థ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యదర్శి పీవీఎల్ నరసింహారావు పేద కళాకారులకు చీరలు, నూతన వస్త్రాలు అందచేశారు. మాడుగుల రామకృష్ణ, గంగాధరరావు, మల్లేశ్వర పట్నాయక్, హరగోపాల్, మార్కండేయ రాజు పాల్గొన్నారు.



జంధ్యాల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గుమ్మడి గోపాలకృష్ణ, వేముల హజరత్తయ్య గుప్తా తదితరులు

కాల్వలు, చెరువుల వెంబడి
ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ

జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా



విజయవాడ రూరల్, పాయకాపురం జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాల్వలు, చెరువుల వెంబడి ఆక్రమణలను గుర్తించి తొలగించేందుకు కార్యచరణ రూపొందించాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా అధికారులను ఆదేశించారు. [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్] గురువారం నగరంలోని తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించిన ఆమె ఆక్రమణల విషయంలో అధికారులకు తగు సూచనలు చేశారు. విజయవాడ రూరల్ మండలం, నగరంలోని పాయకాపురం ప్రాంతాల నడుమ బుడమేరు కరకట్ట వెంబడి కాలువ ఆక్రమణలకు గురౌతున్న విషయమై 'కాల్వ కనుమరుగు' పేరుతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. ఆ విషయమై తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసిన ఆమె జీవోఎంఎస్ నెం 386 ప్రకారం నీటి వనరులు, చెరువుల బెడ్‌లను ఆక్రమణల నుంచి రక్షించేందుకు జిల్లా స్థాయిలో వాచ్‌డాగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సదరు కమిటీ ప్రతి నీటి వనరు, చెరువు బెడ్‌ల పరిస్థితిని సమీక్షించి ప్రభుత్వానికి త్రైమాసిక నివేదిక ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఆక్రమణలు, శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలను గుర్తించి జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సమావేశంలో నిర్ణయించామన్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. వీఎంసీ అధికారులు, ఇరిగేషన్, ప్రజారోగ్య శాఖ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.